అమర్ అక్రమ నిర్మాణం

నాడు వైసీపీ మంత్రిగా అధికార దుర్వినియోగం

- జీవీఎంసీ అనుమతి లేకుండానే వాణిజ్య సముదాయం నిర్మాణం
- జాతీయ రహదారిని అనుకుని జీ+4 భవనం
- సెట్‌బ్యాక్‌లు విడిచిపెట్టకుండానే...
- నోటీసులు జారీచేసినా బేఖాతరు
- జీవీఎంసీ అధికారులపై ఒత్తిడి
- మంత్రిగా ఉండడంతో చర్యలకు వెనుకాడిన అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ పాలనలో గుడివాడ అమర్‌నాథ్ మంత్రిగా ఒరగబెట్టిందేమీ లేకపోయినా ఆయన ఎక్కడకు వెళ్లినా హడావుడి మాత్రం తక్కువేం లేదు!. మంత్రి కావడంతో అధికారులు సైతం ఆయన ఆదేశాలకు 'జీ హుజూర్' అంటూ సాగిలపడిపోయేవారు. దీన్ని ఆసరాగా తీసుకుని పారిశ్రామిక ప్రాంతంగా గుర్తింపు పొందిన గాజువాకలో అమర్ జాతీయ రహదారికి ఆనుకుని అడ్డగోలుగా ఐదంతస్థుల షాపింగ్‌మాల్‌ను నిర్మించేశారు. జీవీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే భవన నిర్మాణం పూర్తి చేసేశారు. దీనికి సమీపంలోనే ప్రస్తుత టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌కు చెందిన భవనాన్ని వైసీపీ హయాంలో నిబంధనల పేరిట కూలగొట్టిన అధికారులు...ఇప్పుడు గుడివాడ అమర్ భవనం విషయంలో ఎందుకు ఉపేక్షిస్తున్నారంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు.





గాజువాకలో జాతీయ రహదారిని అనుకుని ప్లాన్ లేకుండానే నిర్మించిన మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ షాపింగ్‌మాల్

అధికారం అండతో అడ్డగోలుగా నిర్మాణం

గాజువాకలోని చట్టివానిపాలెం వద్ద హైవేను ఆనుకుని అమర్‌నాథ్‌కు సుమారు 400 గజాల స్థలం ఉంది. అందులో వాణిజ్య సముదాయం నిర్మాణం కోసం అనుమతి కోరుతూ జీవీఎంసీకి రెండేళ్ల కిందట ఆన్‌లైన్‌లో ప్లాన్‌కు దరఖాస్తు చేశారు. దరఖాస్తు ఫీజు కింద రూ.పది వేలు చెల్లించారు. అయితే భవన నిర్మాణ కోసం ప్రతిపాదించిన స్థలం జాతీయ రహదారికి ఆనుకుని ఉంది. ఆ రహదారిని భవిష్యత్తులో 80 మీటర్లకు విస్తరించాలని మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరిచారు. మాస్టర్‌ప్లాన్ ప్లాన్ ప్రకారం రోడ్డు విస్తరణకు సర్వే నిర్వహించి ఇరువైపుల ఎంతవరకూ భూమి అవసరమవుతోందో గుర్తించి జీవీఎంసీ అధికారులు ఆర్‌డీపీ (రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్) ఇవ్వాలి. ఒకవేళ ప్రైవేటు స్థలం కూడా రహదారి విస్తరణకు అవసరమని తేలితే ఆ మేరకు జీవీఎంసీ స్వాధీనం చేసుకుని, పరిహారంగా యజమానికి టీడీఆర్ ఇస్తుంది. ఆ ప్రక్రియ పూర్తికాకపోవడంతో మాజీ మంత్రి అమర్‌నాథ్ భవన నిర్మాణం కోసం చేసుకున్న దరఖాస్తు ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉండిపోయింది. అయినప్పటికీ అధికారం అండతో మంత్రి భవన నిర్మాణం ప్రారంభించేశారు. పైగా నిర్మాణంలో సెట్‌బ్యాక్‌లు కనీసం విడిచిపెట్టలేదు. జాతీయ రహదారిని మాస్టర్‌ప్లాన్ ప్రకారం విస్తరిస్తే ఇప్పుడున్న రోడ్డుకు ఇరువైపులా కనీసం 15 అడుగులు వరకూ వెడల్పు పెరుగుతుంది. అక్కడి నుంచి రోడ్డు వైపు భవనం ముందుభాగంలో 20 అడుగులు సెట్‌బ్యాక్ కింద విడిచిపెట్టాలి. అయితే కనీసం ఐదు అడుగులు కూడా విడిచిపెట్టలేదు. అదేవిధంగా మూడువైపులా మూడు మీటర్ల చొప్పున సెట్‌బ్యాక్ కింద వదలాలి. ఒక మీటరు కూడా సెట్‌బ్యాక్ విడిచిపెట్టలేదు. పైగా భవనానికి పశ్చిమ వైపు నుంచి చట్టివానిపాలెం గ్రామంలోకి వెళ్లేందుకు ఐదు అడుగుల రోడ్డు ఉంది. దీన్ని కూడా భవిష్యత్తులో 30 అడుగులకు విస్తరించే ప్రతిపాదన ఉండడంతో అటు వైపు కూడా పది అడుగులు విడిచిపెట్టి తర్వాత భవనం నిర్మించాల్సి ఉన్నప్పటికీ ఆ రోడ్డును అంటిపెట్టుకుని భవన నిర్మాణం చేసేశారు. ఆగమేఘాల మీద భవన నిర్మాణం పూర్తిచేసి ఎన్నికలకు ముందు అందులో పార్టీ కార్యాలయం ప్రారంభించేశారు.

టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులిచ్చినా బేఖాతరు

ప్లాన్ లేకుండా భవన నిర్మాణం చేయడంతో పాటు సెట్‌బ్యాక్ ... మిగతా 6వ పేజీలో

కలెక్టర్ బదిలీ

- సాధారణ పరిపాలనా విభాగంలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు
- జాయింట్ కలెక్టర్‌కు తాత్కాలికంగా ఇన్‌చార్జి బాధ్యతలు
- దాదాపు మూడేళ్లు కలెక్టర్‌గా పనిచేసిన డాక్టర్ ఎ.మల్లికార్జున



విశాఖపట్నం, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను ప్రభుత్వం శనివారం బదిలీ చేసింది. ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. నేరుగా సాధారణ పరిపాలనా విభాగంలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులను బదిలీలు జరుగుతాయని వారం నుంచి చర్చ సాగుతుంది. నాలుగు రోజుల క్రితం సీనియర్ అధికారులను బదిలీ చేసిన ప్రభుత్వం శనివారం కలెక్టర్లను బదిలీ చేసింది. ప్రస్తుతం విశాఖ కలెక్టర్‌గా ఎవరినీ నియమించలేదు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌కు తాత్కాలికంగా కలెక్టర్ బాధ్యతలు అప్పగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.

కాగా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్‌గా ఉన్న మల్లికార్జునను గత ప్రభుత్వం 2021 జూలై 28న విశాఖ కలెక్టర్‌గా నియమించింది. 2012 సివిల్ సర్వీస్ డైరెక్ట రిక్రూటీ అయిన మల్లికార్జున విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌గా రెండు సంవత్సరాల 11 నెలల పాటు పనిచేశారు. ఆయన ఉమ్మడి జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడే 2022 ఏప్రిల్‌లో జిల్లాల విభజన జరిగింది. అప్పుడు మల్లికార్జునను విశాఖ కలెక్టర్‌గా కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతోపాటు ఆయన వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా రెండేళ్లకుపైగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించారు.

విశాఖతో చాలా మధుర స్మృతులు

మల్లికార్జున

విశాఖ కలెక్టర్‌గా మూడేళ్లు సమర్థంగా పనిచేయడానికి సహకరించిన ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు, అధికారులు, ఉద్యోగులు, ప్రజలు, పారిశ్రామిక సంస్థల ప్రతినిధులకు ధన్యవాదాలు. విశాఖపట్నం నాకు ఎన్నో అనుభవాలు ఇచ్చింది. ఉద్యోగరీత్యా సమర్థంగా పనిచేసేలా ఎన్నో నేర్పించింది. నాకు అనేక మధురస్మృతులు ఇచ్చింది. విశాఖ జిల్లాకు కలెక్టర్‌గా మంచి చేశాననే భావనతో వెళుతున్నా. భవిష్యత్తులో విశాఖకు సేవ చేసే అవకాశం వస్తే సంతోషిస్తా. ఉద్యోగ రీత్యా విశాఖకు మేలు చేసే ఏ సహాయం చేయడానికి అయినా ముందు వరుసలో ఉంటా. అందరికీ ధన్యవాదాలు.

కేజీహెచ్‌లో మార్పులు

ఉత్తరాంధ్రలో అతి పెద్ద ఆస్పత్రి కేజీహెచ్‌లో అనేక మార్పులు తీసుకురావడంతో డాక్టర్ మల్లికార్జున ముద్ర ఉంది. స్వతహాగా వైద్యుడైన మల్లికార్జున విశాఖ పరిసరాల్లో పలు పరిశ్రమలు, పారిశ్రామికవేత్తల నుంచి సేకరించిన సీఎస్సార్ నిధుల నుంచి రూ.30 కోట్లు ఖర్చు చేసి కేజీహెచ్‌లో మౌలిక వసతులు కల్పించారు. ఓపీ కౌంటర్‌తోపాటు పలు విభాగాల ఆధునికీకరణ, ఎంఆర్‌ఐ, సీటీ స్కాన్ యంత్రాల కొనుగోలు, మార్చురీలో వసతులు పెంపు, రోగుల అటెండెంట్లు ఉండేందుకు పది షెడ్లు నిర్మాణం వంటివి చేపట్టారు. విక్టోరియా ఆస్పత్రి, మానసిక ఆస్పత్రి, టీబీ ఆస్పత్రి, ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో వసతులు పెంచారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోయినా సీఎస్సార్ నిధుల నుంచి జిల్లాలో 23 సాంఘిక, బీసీ సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించారు. కలెక్టర్‌గా తనను కలిసేందుకు వచ్చే వారిలో ప్రతి ఒక్కరి సమస్య వినేవారు. ఈ నేపథ్యంలో పేద వర్గాల కోసం సంజీవని నిధి ఏర్పాటుచేశారు.

దసపల్లా భూముల అప్పగింతపై విమర్శలు

నగరంలో వేల కోట్ల రూపాయల విలువైన ... మిగతా 6వ పేజీలో



టమాటా ధరకు రెక్కలు

- ప్రస్తుతం రైతుబజారులో కిలో రూ.66
- బయట మార్కెట్‌లో రూ.90
- డిమాండ్‌కు సరిపడా సరకు రాక నగరంలో కొరత

గోపాలపట్నం, జూన్ 22: టమాటా ధర రోజురోజుకూ పెరిగిపోతోంది. నెల క్రితం రైతుబజార్‌లో కిలో రూ.28 ఉండగా, ప్రస్తుతం రూ.66కి చేరింది. ఈ ధర మరికాస్త పెరిగే అవకాశం కూడా ఉందని వర్తకులు చెబుతున్నారు. నెల రోజుల వ్యవధిలో కిలోకు రూ.38 పెరిగింది.

సాధారణంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో డిసెంబరు నుంచి ఏప్రిల్ నెల వరకూ టమాటా సీజన్ ఉంటుంది. స్థానికంగా పంట దిగుబడి ఎక్కువగా ఉండడంతో ఆ నెలల్లో ధర తగ్గుతుంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో పంట అయిపోయిన తరువాత రాయలసీమ ప్రాంతం నుంచి దిగుమతయ్యే టమాటాపైనే జిల్లాలోని వర్తకులు ఆధారపడతారు. దీంతో ధర మే నెల నుంచి కొద్దికొద్దిగా పెరుగుతుంది. ఈ క్రమంలో గత నెల రోజుల్లో కిలోకు రూ.40 పెరిగి ప్రస్తుతం రైతుబజార్‌లో ధర రూ.66కి చేరింది. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.90పైనే విక్రయిస్తున్నారు. దీంతో టమాటా కొనుగోలు కోసం సాధారణ జనాలు రైతుబజార్‌వైపు చూస్తున్నారు. అయితే రైతుబజారులో కూడా డిమాండ్‌కు సరిపడా టమాటా లేకపోవడంతో ఇబ్బంది తప్పడం లేదు.

నగరంలో టమాటా కొరత

ప్రస్తుతం నగరానికి మదనపల్లి, గుర్రంకొండ ప్రాంతాల నుంచి టమాటా దిగుమతి జరుగుతుంది. నిత్యం 250 నుంచి 270 టన్నుల టమాటా అవసరం. అయితే నగరానికి టమాటా ఎగుమతి చేసే జిల్లాల్లో కూడా పంట కొరత కారణంగా ప్రస్తుతం 150 టన్నులు మాత్రమే వస్తుంది. దీంతో రైతుబజారుల్లో డిమాండ్‌కు సరిపడా సరకు హోల్ సేల్ వర్తకులు ఇవ్వలేకపోతున్నారు. దీంతో కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు. రాయలసీమలో పూర్తిస్థాయిలో పంట ఉత్పత్తి జరిగితేనే టమాటా ధర తగ్గుముఖం పట్టడంతో పాటు కొరత కూడా తీరుతుందని వర్తకులు చెబుతున్నారు.

కుర్చీ వదలరా!?

రిటైరైన తరువాత కూడా ప్రభుత్వ శాఖల్లో కీలక స్థానాల్లో కొనసాగుతున్న వారిని సాగనంపాలని ఆదేశాలు



- ప్రస్తుతానికి ఆర్ట్స్ కళాశాల, మహిళా కళాశాల ప్రిన్సిపాల్స్ రాజీనామా
- వారి స్థానంలో సీనియర్లకు బాధ్యతలు
- ఏయూలో అలాంటివారు బోలెడుమంది...
- వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా వర్సిటీ పాలకుల నిర్ణయాలు
- ఓఎస్‌డీగా ప్రొఫెసర్ కృష్ణమోహన్, దూర విద్యా కేంద్రం డైరెక్టర్‌గా ప్రొఫెసర్ విశ్వేశ్వరరావు, ఐఏఎస్ఈ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ ప్రొఫెసర్ శోభశ్రీ నియామకం
- ఇంకా మరికొందరు...
- మిగిలినవారు తప్పుకుంటారా?, ప్రభుత్వం తప్పించేంత వరకూ కొనసాగుతారా??

విశాఖపట్నం, జూన్ 22 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పదవీ విరమణ తరువాత కూడా అనేకమంది ప్రొఫెసర్లు కీలక స్థానాల్లో కొనసాగు తున్నారు. రిటైరైన తరువాత కీలక స్థానాల్లో కొనసాగుతున్న అధికారులు, ఉద్యోగులు వెంటనే రాజీనామా చేయాల్సిందిగా ప్రభుత్వం ఈ నెల 20న ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో యూనివర్సిటీలో గడిచిన కొన్నాళ్ల నుంచి కొనసాగుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్లపై అందరి దృష్టిపడింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వీరంతా రాజీనామా చేస్తారా?, లేక ప్రభుత్వం బలవంతంగా తొలగించేంత వరకూ అలాగే ఉంటారా? అన్నది తేలాలి.

వర్సిటీలో రిటైర్డ్ ప్రొఫెసర్లను అనేక విభాగాలకు ప్రిన్సిపాల్స్, డైరెక్టర్లు, డీన్లుగా ఉన్నతాధికారులు నియమించారు. దీనిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అయినప్పటికీ పట్టించు కోలేదు. కొత్త ప్రభుత్వం ఈ నియామకాలపై దృష్టిసారించి రాజీనామాలు చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఏయూలో పదవీ విరమణ తరువాత కూడా సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా కొనసాగుతూ వచ్చిన కె.శ్రీనివాసరావు, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భట్టి రాజీనామా చేశారు. వీరి స్థానంలో సీనియర్ ప్రొఫెసర్లను నియమిస్తూ ఏయూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. అయితే, ఇంకా అనేక విభాగాల్లో రాజీనామా చేయాల్సిన అధికారులు ఉన్నారు. వీరి వ్యవహారంపై ప్రస్తుతం ... మిగతా 6వ పేజీలో

ఏయూ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఎంవీఆర్ రాజు

- 6వ పేజీలో

- మహిళా ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఆర్.పద్మశ్రీ



ఎంవీఆర్ రాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న సన్నిహితులు

రైల్వే రద్దుల పద్దు

ఆగస్టు 10వ తేదీ వరకు 8 జతల రైళ్లు రద్దు

- జాబితాలో రత్నాచల్, జన్మభూమి, సింహాద్రి, ఉదయ్, తిరుపతి డబుల్ డెక్కర్
- వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఆక్యుపెన్సీ పెంచేందుకే...
- ఆదాయమే ముఖ్యమన్నట్టుగా వ్యవహారం
- సామాన్య ప్రయాణికులపై దొంగ దెబ్బ



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)


రైల్వే శాఖ ఆదాయమే ప్రధానమన్నట్టుగా వ్యవహ రిస్తోంది. సామాన్యుల రవాణా సాధనం అనే పేరును క్రమంగా తుడిచేస్తోంది. అధిక ఆదాయం వచ్చే వందే భారత్ రైళ్ల నడపడంపైనే శ్రద్ధ చూపిస్తోంది. వేలాది మంది నిత్యం ప్రయాణించే పేరొందిన రైళ్లను ఎడాపెడా రద్దు చేసి పడేస్తోంది. అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, తనిఖీలు నిర్వహిస్తున్నారని అవాస్తవాలు చెబుతోంది.

వాల్తేరు రైల్వే డివిజన్ అంటే తూర్పు కోస్తా జోన్ అధికారులకు ఆది నుంచి సవతి ప్రేమే. ఈ మార్గంలో రైళ్లకు క్లియరెన్స్ ఇవ్వకపోవడం, ఇక్కడి రైళ్లను భువనేశ్వర్ వరకూ పొడిగించుకోవడం, అభివృద్ధి పనుల్లో సరైన ప్రాధాన్యం ఇవ్వకపోవడం ఎప్పటి నుంచో జరుగుతోంది. ఆ నేపథ్యంలో విశాఖపట్నం కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ కావాలనే డిమాండ్ ఊపందుకొని ఉద్యమంగా మారింది. జోన్ సాధించుకున్నా ఇప్పటికీ దానికి సంబంధించిన పనులు ప్రారంభం కాకపోవడం వివక్షకు నిదర్శనం.

ఇదిలావుండగా గత ఏడాది జనవరిలో విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభమైంది. ఈ రైలుకు డిమాండ్ బాగానే ఉంది. విశాఖలో ఉదయం 5.45 గంటలకు బయలుదేరి 10 గంటలకు విజయవాడ, మధ్యాహ్నం 2 గంటలకు సికింద్రాబాద్ చేరుతోంది. అయితే దీనిని 100 శాతం ఆక్యుపెన్సీతో నడిపించాలనే ఉద్దేశంతో రైల్వే అధికారులు కుట్ర చేస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వేకు చెందిన విజయవాడ డివిజన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, భద్రతాపరమైన తనిఖీలు నిర్వహిస్తున్నారంటూ ఏడాది కాలంగా సామాన్యులు ప్రయాణించే ప్రసిద్ధ రైళ్లను రద్దు చేస్తున్నారు. విశాఖపట్నం-విజయవాడ మధ్య నడిచే రత్నాచల్, విశాఖపట్నం-గుంటూరు మధ్య నడిచే సింహాద్రి ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య నడిచే జన్మభూమి ఎక్స్‌ప్రెస్, అలాగే విజయవాడ వరకు వెళ్లే ఉదయ్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-రాజమండ్రి పాసింజర్, మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్, గుంటూరు-రాయగడ రైళ్లను తరచూ రద్దు చేస్తున్నారు. ఈ ఏడాది మార్చిలో సికింద్రాబాద్ మార్గంలో మరొకటి, భువనేశ్వర్‌కు మరో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను ప్రారంభించారు. దీంతో ఇటువైపు పలాస, గుణుపూర్, బరంపూర్, భువనేశ్వర్ రైళ్లను క్యాన్సిల్ చేస్తున్నారు. వీటికి కూడా ఇతర కారణాలు చూపిస్తున్నారు. అయితే ఇవే మార్గాల్లో నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను మాత్రం రద్దు చేయడం లేదు. అభివృద్ధి పనులు, భద్రతా పరమైన తనిఖీలు కేవలం సామాన్య ప్రయాణికులు నడిచే రైళ్లకేనా?, వందే భారత్‌కి వర్తించవా? అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. దీనికి అధికారులు సమాధానం చెప్పడం లేదు.

విజయవాడ డివిజన్ అధికారులు కొన్ని సమయాలను మాత్రమే రైళ్ల రాకపోకలకు కేటాయిస్తున్నారని, మిగిలిన సమయం రద్దు చేస్తున్నారని, అదంతా వారి చేతిలో ఉందని వాల్తేరు డివిజన్ అధికారులు తప్పించుకుంటున్నారు.ఆ స్లాట్ల నిర్ణయం వారి చేతుల్లో ఉందని చెబుతున్నారు. వందేభారత్ కంటే ... మిగతా 6వ పేజీలో

సైబీరియా పక్షుల సందడి



- వివరాలు I పేజీలో

తగరపువలస-భీమిలి రహదారి మధ్యలో ఉన్న చిల్లపేట చెరువులో సైబీరియా పక్షులు సందడి చేస్తు న్నాయి. ఇటీవల ఈ చెరువులో పూడిక తీయడంతో జలకళ సంతరించుకుంది. దీంతో పదుల సంఖ్యలో సైబీరియా పక్షులు ఇక్కడికి చేరి కనువిందు చేస్తున్నాయి. విదేశీ పక్షులు ఈ ప్రాంతానికి రావడం తొలి సారి కావడంతో స్థానికులు వాటిని ఆసక్తిగా తిలకిస్తున్నారు.

శాసనసభాపతిగా అయ్యన్న

- నాలుగు దశాబ్దాలకుపైగా రాజకీయ అనుభవం
- పది సార్లు ఎమ్మెల్యేగా పోటీ... ఏడు సార్లు గెలుపు
- ఐదు పర్యాయాలు మంత్రిగా సేవలు
- ఒకసారి అనకాపల్లి ఎంపీగా విజయం

నర్సీపట్నం, జూన్ 22: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతిగా శనివారం బాధ్యతలు చేపట్టడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి జిల్లా నుంచి స్పీకర్ పదవి చేపట్టిన తొలి ఎమ్మెల్యేగా అయ్యన్నపాత్రుడు రికార్డు సృష్టించారు. ఆయనకు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉంది. ఒకే పార్టీలో ఉంటూ, ఒకే నియోజకవర్గం నుంచి పదిసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఘనత సాధించారు. ఏడుసార్లు శాసన సభ్యునిగా నర్సీపట్నం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. ఎన్టీ రామారావు, చంద్రబాబు క్యాబినెట్‌లలో ఐదు పర్యాయాలు మంత్రిగా పనిచేశారు. ఒకసారి ఎంపీగా ఎన్నికయ్యారు.



స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించిన అయ్యన్నపాత్రుడుకి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం, పక్కన ఆయన సతీమణి పద్మావతి ఉన్నారు.

జూలై 27న అంబేద్కర్ ఆలోచనా ఫౌండేషన్ వర్క్‌షాప్

డాబాగార్డెన్స్, జూన్ 22: అంబేద్కర్ ఆలోచనా ఫౌండేషన్ 17వ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ జూలై 27న కాకినాడలోనిర్వహిస్తున్నట్టు రాష్ట్ర కన్వీనర్ బైపా అరుణ్ కుమార్ , రాష్ట్ర అధ్యక్షుడు పినిపే వెంకటరామకృష్ణ తెలిపారు. శుక్రవారం బీఏకే ఛాంబర్స్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.న్యాయవాదులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్, ఆర్థిక సాయం, ఇళ్లస్థలాలు కేటాయించాలని ప్రభుత్వాన్నికోరారు.న్యాయవాదులు టి.బోసుబాబు, వి.చిన్నారావు, బి.కృష్ణారావు, పి.చలపతి, నాగకుమారితదితరులు పాల్గొన్నారు





సత్యనారాయణ స్వామి ఆలయంలో పౌర్ణమి పూజలు

మహారాణిపేట, జూన్ 22: ఇసుక కొండపై వేంచేసిన శ్రీ రమా సత్యనారాయణకి పౌర్ణమి పూజలు వైభవంగా జరిపారు. వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం జ్యేష్ట పౌర్ణమి పురస్కరించుకుని స్వామి వా రికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు సామూహిక సత్య వ్రతాలు నిర్వహించారు. భక్తులు ధ్వజ స్తంభం ప్రదక్షణలు చేశారు. భీమిలి శాసన సభ్యుడు గంటా శ్రీనివాసరావు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బుద్దా మహలక్ష్మి నగేష్ భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదం అందించారు. ఆదివారం ఉదయం స్వామి వారికి పుష్పయాగం అనంతరం పవళింపు సేవతో కళ్యాణ మహోత్సవాలు ముగియనున్నట్టు ఈవో తెలిపారు.


అలంకరణలో స్వామివారు


సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాల్లో భక్తులు

ఏయూ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఎంవీఆర్ రాజు

మహిళా ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఆర్.పద్మశ్రీ

విశాఖపట్నం, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సైకాలజీ విభాగానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు నియమితులయ్యారు. శనివారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజుకు ఏయూ మాజీ వీసీలు ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, ప్రొఫెసర్ జి.నాగేశ్వరరావు, శ్రీకాకుళంలోని అంబేడ్కర్ విశ్వ విద్యాలయం మాజీ వీసీ ప్రొఫెసర్ రాంజీ, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నరసింహరాజు, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శశిభూషణ్‌తోపాటు ఇతర అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. సైన్స్ అండ్ టెక్నాలజీ కళా శాల ప్రిన్సిపాల్‌గా ఉన్న కె.శ్రీనివాసరావు రాజీనామా చేయ డంతో ఆయన స్థానంలో ఎంవీఆర్ రాజు బాధ్యతలు చేపట్టారు. అలాగే, మహిళా ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సి పాల్‌గా ప్రొఫెసర్ ఆర్.పద్మ నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు రావడంతో ఆమె శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఆ స్థానంలో కొనసాగిన ప్రొఫెసర్ కె.భట్టి రాజీనామా చేశారు.

సేఫ్టీ కోర్సుల శిక్షణ అభ్యర్థులు స్టీల్ ప్లాంట్ సందర్శన

కంచరపాలెం, జూన్ 22 : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫైర్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ సేఫ్టీ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు శనివారం ఇండస్ట్రియల్ టూర్‌లో భాగంగా స్టీల్ ప్లాంట్‌ను సందర్శించారు. ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ ఆధ్వర్యంలో 30 మంది అభ్యర్థులు స్టీల్‌ప్లాంట్‌లో పలు విభాగాలను సందర్శించి వివరాలను తెలుసుకున్నారు. స్టీల్ ఉత్పత్తి, బ్లాస్ట్ ఫర్నేసర్, లెర్నింగ్ &డెవలప్‌మెంట్ సెంటర్ తదితర కేంద్రాలను సందర్శించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇటువంటి పర్యటన వల్ల శిక్షణ పొందుతున్న అభ్యర్థులు నైపుణ్యాలను పెంచుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డా.బీవీ లక్ష్మణరావు, కె.వరహాలు పాల్గొన్నారు.

ఐటీఐలో మిగులు సీట్లకు రేపటి నుంచి కౌన్సెలింగ్

కంచరపాలెం, జూన్ 22 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2024-2025 విద్యాసంవత్సరంగాను ప్రవేశాల ప్రక్రియ ఈనెల 19వ తేదీ నుంచి జరుగుతున్న సంగతి తెలిసిందే. మొదటి విడత కౌన్సెలింగ్‌లో ఆదివారం వరకు భర్తీకాని సీట్లకు గాను ఈనెల 24, 25, 26 తేదీల్లో మళ్లీ కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్టు జిల్లా ఐటీఐల కన్వీనర్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈనెల 24న ఉదయం 8కు స్టీల్ ప్లాంట్ భూ బాధితులకు కేటాయించిన భర్తీకాని సీట్లు, బాలికలు, ఎక్స్ సర్వీస్ మెన్, దివ్యాంగులు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు తదితర కేటగిరీలకు మొదటి ర్యాంకు నుంచి 3398 ర్యాంకు వరకు, జనరల్ అభ్యర్థులకు మొదటి ర్యాంకు నుంచి 892 ర్యాంకు వరకు గల వారికి కౌన్సెలింగ్ ఉంటుంది.. ఈ నెల 25న 893 ర్యాంకు నుంచి 2309 ర్యాంకు వరకు, 26న 2310 ర్యాంకు నుంచి 3398 ర్యాంకు వరకు గల అభ్యర్థులకు కౌన్సెలింగ్‌ను చేపట్టనున్నారు. సీట్లు పొందని మెరిట్ విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

టిడ్కో ఇళ్ల అక్రమాలపై విచారణ జరపాలి

›› 39 వార్డు కార్పొరేటర్ సాధిక్ డిమాండ్



పూర్ణామార్కెట్, జూన్ 22: వన్‌టౌన్ సీహార్స్ వద్ద టిడ్కో ఇళ్ల కేటాయింపులో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని దక్షిణ జనసేన నాయకుడు, 39వ వార్డు కార్పొరేటర్ సాధిక్ డిమాండ్ చేశారు. శనివారం వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ సౌత్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్, యూసీడీ అధికారులు సీహార్స్ వద్ద టిడ్కో ఇళ్లలో కేటాయింపులో అక్రమాలకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. స్థానికులకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. పేదవర్గాలకు కేటాయించాల్సిన ఇళ్లను మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి తన అనుయాయులకు కేటాయించారని అన్నారు. ఇలా దక్కించుకున్న టిడ్కో ఇళ్లు ఆ లబ్ధిదారులు ఇళ్లు అమ్ముకున్నారని, తక్షణం దీనిపై విచారణ జరపాలని డి మాండ్ చేశారు. సీహార్స్ టిడ్కో ఇళ్ల కేటాయింపులో వైసీపీ అక్రమాలను వెలికి తీయాలని డిమాండ్ చేశారు. యూసీడీ అధికారులు వైసీపీ నాయకులతో కలిసి కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడినట్టు స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం బాధ్యులపై చర్యలు దిగాలని కోరారు.

'వాణిజ్య సముదాయాల కేటాయింపులో రిజర్వేషన్లు ఉండాలి '


సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ ప్రతినిధులు

జగదాంబ కూడలి, జూన్ 22: గ్రేటర్ జోన్-4 పరిధిలో వాణిజ్య సముదాయాల కేటాయింపులో రిజర్వేషన్లు పాటించాలని కులవివక్ష పోరాట సంఘం ప్రతినిధులు వై.రాజు, ఎం.సుబ్బారావు డిమాండ్ చేశారు. శనివారం సిటు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు వై.రాజు మాట్లాడుతూ జోన్-4 పరిధిలో డైక్స్ ట్యాంకు, జగదాంబ, పాతబస్టాండ్ ఫేజ్ -2, పద్మానగర్, సూర్యాబాగ్‌లోని వాణిజ్య సముదాయాలు, అంబేడ్కర్ కల్యాణ మండపం, ఎస్‌వీపీ మార్కెట్, (పూర్ణామార్కెట్), రామకృష్ణా రైతుబజారు, రెల్లివీధి చేపల మార్కెట్‌లో ఆశీలు వసూలు కోసం 28 తేదీన నిర్వహించే బహిరంగ వేలం పాటలో రిజర్వేషన్లు పాటించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, వాణ్యి సముదాయాల కేటాయింపులో స్థానికులకు, ఆయా వృత్తుల వారికి ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఆశీల వేలం పాట పారదర్శంగా జరిగేలా జోల్ కమీషనర్ ప్రసాదరావు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఇప్పటి వరకు ఆశీలు వసూలు కాంట్రాక్టర్ నియామకాల్లో నిబంధనలు పాటించలేదని ఆయన ఆరోపించారు.

అర్థవంతమైన బోధనతో విద్యా ప్రమాణాలు పెంపు


కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులతో కమొడోర్ రజిత్‌నాగపాల్

మల్కాపురం, జూన్ 22: హైదరాబాద్ రీజియన్ పరిధిలోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోగల వివిధ కేంద్రీయ విద్యాలయాల్లో నియమితులైన సుమారు 50 ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను శనివారం 104 ఏరియా విజయనగర్ కాలనీ కేంద్రీయ విద్యాలయం-2లో ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈస్ట్రన్ నేవల్ కమాండ్ కమొడోర్ రజత్‌నాగపాల్ మాట్లాడుతూ వివిధ అంశాలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలన్నారు.ఐదురోజులపాటు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమంలో జాతీయ విద్యావిధానం, నిపుణ్‌భారత్, పాలసీ అనుసరణ, నేషనల్ కరిక్యూలమ్ ఫ్రేమ్ వర్క్, ఉపాధ్యాయుల ప్రవర్తన నియమవళి తదితర అంశాలలో తర్ఫీదు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీ-1,2 ఉపాధ్యాయులు మదీనా మాలిక్, సీహెచ్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు సాహిత్య, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారులో తనిఖీలు

అక్కయ్యపాలెం, జూన్ 22: గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్‌లోని రైతుబజారులో జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ శాఖాధికారి యాసీన్ ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బజారులో డ్వాక్రా, రైతు స్టాళ్లలో ఉల్లి, టమా టాలను ఏ విధంగా విక్రయిస్తున్నారని, వాటి నాణ్యతను పరిశీలించారు. తూకం సరిగ్గా వేస్తున్నారా లేదా అని తనిఖీలు చేశారు. వినియోగదారులకు నాణ్యమైన సరకులు విక్రయించాలని డ్వాక్రా మహిళలను ఆదేశించారు. ఆయనతో పాటు రైతుబజారు ఎస్టేట్ అధికారి పి.చిన్నబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ ఉన్నారు.


స్టాల్‌లో టమాటాను పరిశీలిస్తున్న ఏడీ యాసీన్

త్రిశక్తి వైభవంపై ప్రవచనాలు

అక్కయ్యపాలెం, జూన్ 22: గురుదేవుల ఆరాధనోత్సవాల్లో భాగంగా లలితా పీఠంలో శ్రీ శక్తి పీఠాధిపతి మంత్ర మహేశ్వరి రమ్యానంద భారతీ స్వామిని త్రిశక్తి వైభవంపై శనివారం రాత్రి ప్రవచనం చేశారు. దేవీ భాగవతం, కాళీ పురాణంలో అమ్మవారి వైభవ విశేషాలు ఎన్నో ఉన్నాయని చెప్పారు. కాళీ రూపంలో అమ్మవారు పరమేశ్వరుడికి ప్రియమైన స్వరూపమన్నారు. శివశక్తి అభేద్యమని, కాళీమాత వాక్ శక్తినిచ్చే దేవతని, సమస్త శక్తుల సమూహారం మహాకాళి అని వివరించారు. మాత అలంకారాలను, ఆయుధాలను పేర్కొన్నారు. కుర్తాళం శంకరాచార్య సిద్ధేశ్వరానంద భారతీ స్వామి సమక్షంలో నిర్వహించిన ఈ ప్ర వచన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశా రు. ఈ కార్యక్రమం పీఠం కార్యనిర్వహణాధికారి మ న్నవ కృష్ణ సేన్ సారధ్యంలో జరిగింది.


అభిభాషణ చేస్తున్న భారతీ స్వామిని

పుస్తకాలు, బ్యాగులు పంపిణీ


కిట్లు అందిస్తున్న కార్పొరేటర్ వసంతలక్ష్మి

జ్ఞానాపురం, జూన్ 22: విద్యార్థులు డ్రాప్‌అవుట్స్ లే కుండా చూడాలని 33వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి కోరారు. ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పుస్తకాలు, బ్యాగులను శనివారం 33వార్డు పరిధి న్యూ మోడల్ స్కూల్‌లో కార్పొరేటర్ అందించారు. 1వతరగతి నుంచి 5వ తరగతి చదువుతున్న వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.అరుణలక్ష్మి, బి.వినోద్, వార్డు జనసన అధ్యక్షులు ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు. జ్ఞానాపురంలోని సెక్రడ్ హార్ట్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు టీడీపీ వార్డు అధ్యక్షుడు ఐతి మధుబాబు పాఠ్యపుస్తకాలు, బ్యాగుల కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐతి రవిబాబు, క్లస్టర్ ఇన్‌చార్జి సానిబాని ఫ్రాన్సిస్, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

నేడు పోర్టు స్టేడియం కళావాణిలో కల్చరల్ ఫెస్టివల్

›› కల్చరల్ మీట్స్ జిల్లా చైర్మన్ వెంకటేశ్వరరావు


వెంకటేశ్వరరావు

సీతమ్మధార, జూన్ 22: పోలియో నిర్మూలనపై అవగాహన, నిధుల సేకరణకు రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీతోపాటు నగరంలోని 22 రోటరీ క్లబ్‌లు సంయుక్తంగా ఈ నెల 23న పోర్టు స్టేడియం కళావాణిలో కల్చరల్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్టు కల్చరల్ మీట్స్ జిల్లా చైర్మన్ కంటిపూడి వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. రోటరీ ఇంటర్నేషనల్ 1986లో పోలియో నిర్మూలన కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు.అప్పటినుంచిప్రపంచంలో పోలియో నిరోధానికి ప్రయత్నిస్తోందన్నారు. రోటరీ ఈ బృహత్తర కార్యక్రమాన్ని తొలుత చేపట్టినప్పుడు 124 దేశాల్లో పోలియో కేసులు ఉన్నాయని, ప్రపంచ వ్యాప్తంగా ప్రతిరోజూ దాదాపు 1,000 మంది పిల్లలు పోలియో బారిన పడుతున్నారన్నారు. గత 39 ఏళ్లుగా అవిశ్రాంతంగా పనిచేసిన తర్వాత, యుఎస్‌డీ 7 బిలియన్లు వ్యయం చేసిన తర్వాత ప్రపంచ వ్యాప్తంగా చాలా మేరకు వ్యాధి తగ్గిందన్నారు. ఈనెల 23న జరిగే ఫెస్టివల్ నిర్వహణకు రోటరీతోపాటు విరాళాలు ఇచ్చే సంస్థలు సంయుక్తంగా పేరు పెట్టుబడి ప్రతిపాదిత స్పాన్సర్ చేయాలని కోరారు. పోలియో ముగింపులో భాగంగా యూఎస్‌డీ రూ.15,000 అందించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ యూఎస్‌సీ రూ.30,000 (గేట్స్ ఫౌండేషన్ ద్వారా 1.2 సహకారంతో సరిపోతుందని తెలిపారు. ఈమొత్తం యూఎస్‌డీ రూ.45,000, 90వేల మంది పిల్లలకు టీకాలు వేయడానికి ఖర్చు చేయనున్నట్టు చెప్పారు. శీర్షిక స్పాన్సర్‌గా రూ. 10 లక్షలు, సీఓ టైటిల్ స్పాన్సర్‌గా రూ.5 లక్షలు, స్పాన్సర్‌గా రూ.2 లక్షలు, దాతగా రూ.లక్ష ఉదారంగా ఇచ్చి ఈ కార్యక్రమాన్ని మద్దతు పలకాలని కోరారు. ఆదివారం జరిగే కల్చరల్ ఫెస్టివల్‌లో ప్రత్యక్ష ప్రదర్శనలో పలువురు ప్రముఖ సినీ కళాకారులు, నటీనటులు, సంగీత దర్శకులు, గాయకులు (ఇండియన్ ఐడల్ ఫస్ట్ ప్లేస్ రేవంత్, ప్రముఖ సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల) పాల్గొననున్నట్టు తెలిపారు. ఈ ఈవెంట్‌ను స్పాన్సర్‌లుపెద్దమొత్తంలో స్పాన్సర్ చేసి తమ సంస్థతో కలిసి రావాలని కోరారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు

జగదాంబ కూడలి, జూన్ 22: వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి శనివారం తులసీదళార్చన పూ జలు, హోమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 9 గంటలకు అమ్మవారికి తులసీ దళాలతో ప్ర త్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చక్ర నవార్చన లక్ష్మీహోమాన్ని అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య జరిపారు. ఈ సందర్భంగా 10 మంది ఉభయదాతలతో పూజలు చేయించారు.

అమర్ అక్రమ నిర్మాణం

... 5వ పేజీ తరువాయి

నిబంధనలు ఉల్లఘించారని, అదనపు అంతస్థులు నిర్మించారంటూ గాజువాక జోన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీచేశారు. దీనిపై మంత్రి హోదాలో ఉన్న అమర్‌నాథ్ నేరుగా జీవీఎంసీ కీలక అధికారికి ఫోన్ చేశారు. దీంతో కీలక అధికారి గాజువాక టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫోన్ చేసి అటువైపు కన్నెత్తి చూడద్దంటూ హుకుం జారీచేయడంతో వారంతా మిన్నకుండిపోవాల్సి వచ్చింది. తాజాగా వైసీపీ అధికారం కోల్పోవడం, అమర్‌నాథ్ కూడా గాజువాక నుంచి పోటీ చేసి ఓడిపోవడంతో అక్రమ భవన నిర్మాణం అంశం బయటపడింది. ఇదిలావుండగా, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నిరకాల నిబంధనలను పాటిస్తూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తుండగా, జాతీయ రహదారి విస్తరణకు రూపొందించిన మాస్టర్‌ప్లాన్ ప్రకారం రెండడుగులు ముందుకువచ్చి భవనం నిర్మించారంటూ జీవీఎంసీ అధికారులు వైసీపీ ప్రభుత్వ హయాంలో యంత్రాలతో నిర్మాణాన్ని నేలమట్టం చేశారు. దానికి కూతవేటు దూరంలోనే మాజీ మంత్రి అమర్‌నాథ్ నిర్మించిన అక్రమ భవనం ఉండడంతో జీవీఎంసీ అధికారులు ఇప్పుడు దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

జీవీఎంసీలోనే ప్లాన్ పెండింగ్: గుడివాడ అమర్‌నాథ్

చట్టివానిపాలెంలో మా తాతల ఆస్తిగా వచ్చిన 400 గజాల స్థలంలో భవన నిర్మాణానికి మూడేళ్ల కిందటే జీవీఎంసీకి ప్లాన్ కోసం దరఖాస్తు చేశాం. అన్ని ఫీజులు చెల్లించడంతోపాటు రోడ్డు విస్తరణకు స్థలం కూడా జీవీఎంసీ పేరిట రిజిస్ట్రేషన్ చేశాను. మాస్టర్ ప్లాన్ ప్రకారం ఆర్‌డీపీ జరగలేదనే కారణంతో ప్లాన్‌ను జీవీఎంసీలో ఇంకా పెండింగ్‌లో ఉంచారు. నా వైపు నుంచి ప్రభుత్వానికి కట్టాల్సిన అన్నిరకాల పన్నులు చెల్లించేశాను.

రైల్వే రద్దుల పద్దు

... 5వ పేజీ తరువాయి

పది రెట్లు ఎక్కువ ప్రయాణికులు వెళ్లే రైళ్లను రద్దు చేసి, అధిక ఆదాయం వచ్చే వందే భారత్ రైళ్లను ప్రమోట్ చేయడానికి, ఆదాయం పెంచుకోవడానికే ఇలా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు తాజాగా జూన్ 24వ తేదీ నుంచి ఆగస్టు పదో తేదీ వరకు విశాఖపట్నం నుంచి రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, సికింద్రాబాద్‌ల మధ్య రోజూ నడిచే ఎనిమిది జతల రైళ్లను రద్దు చేస్తున్నట్టు వాల్తేరు డివిజన్ అధికారులు శనివారం ప్రకటించారు. ఈ జాబితాలో మచిలీపట్నం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (17219), గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (07243), విశాఖ-లింగంపల్లి జన్మభూమి, తిరుపతి-విశాఖ డబుల్ డెక్కర్, విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240), విశాఖ-విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12717), విజయవాడ-విశాఖ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22702), తదితరాలు ఉన్నాయి. అందులో గోదావరి ఎక్స్‌ప్రెస్, గరీబ్‌రథ్ రైళ్లు లేకపోవడం గమనార్హం. ఈ రెండు రైళ్ల ద్వారా వందే భారత్‌తో సమానంగా ఆదాయం వస్తుంది. అందుకని వాటిని రద్దు చేయలేదు. గోదావరి ఎక్స్‌ప్రెస్ రద్దు చేస్తే రాజకీయంగా ఒత్తిడి పెరిగిపోతుంది. అందుకని దాని జోలికి పోకుండా మిగిలిన రైళ్లను రద్దు చేసేశారు. గత ఏడాది కాలంగా ఇలాగే చేస్తున్నారు.

ఇటు భువనేశ్వర్ వైపు చూసుకుంటే ప్రయాణికుల రైళ్లను రద్దు చేసి వాటి స్థానంలో సరకులను రవాణా చేసే గూడ్స్ రైళ్లను నడుపుతున్నారు. రైల్వే ట్రాకుల నిర్మాణం, తనిఖీలు వంటివి జరిగితే గూడ్స్ రైళ్లను ఎలా అనుమతిస్తున్నారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. దీనికి అధికారులు సమాధానం చెప్పలేకపోతున్నారు. నీళ్లు నములుతున్నారు. ఆదాయం కోసం క్రమంగా వందేభారత్‌ల సంఖ్యను పెంచేసి, సాధారణ ప్రయాణికులు ఉపయోగించుకునే పాసింజర్ రైళ్లను తప్పించాలని కుట్ర జరుగుతోంది. ఈ ప్రాంత నాయకులు, ప్రజలు ఉద్యమిస్తే తప్ప ఈ కుట్రలు ఆగవు. రైళ్ల రద్దుకు పుల్‌స్టాప్ పడదు. ఎవరు దీనికి నడుం బిగిస్తారో చూడాలి.

కలెక్టర్ బదిలీ

... 5వ పేజీ తరువాయి

దసపల్లా భూముల విషయంలో కలెక్టర్‌పై ఆరోపణలు ఉన్నాయి. దసపల్లా భూములను 2014లో అప్పటి కలెక్టర్ యువరాజ్ '22 ఎ' పెట్టారు. అయితే హైకోర్టు ఆదేశాలలో 2016లో 22 (ఎ) నుంచి తొలగించారు. ఈ భూములను గత ప్రభుత్వ హయాంలో కేబినెట్ తీసుకున్ననిర్ణయం మేరకు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. దీనిపై ఆనేక విమర్శలు వచ్చాయి. ఇక, నగర పరిధిలోని ఎండాడలో వైసీపీ కార్యాలయం కోసం అడ్డగోలుగానిర్మించిన భారీ భవనానికి అనుమతులు ఇచ్చే విష యంలో వీఎంఆర్‌డీఏ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారనే వార్తలు వచ్చాయి. ఈ విషయంలో కలెక్టర్‌పై ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తంచేసిందనే ప్రచారం సాగుతుంది.

నేడు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు బాధ్యతలు

బదిలీపై వెళుతున్న కలెక్టర్ మల్లికార్జున ఆదివారం ఉదయం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు బాధ్యతలు అప్పగించనున్నారు. ఈ మేరకు జిల్లా రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ర్యాబిస్ వ్యాధితో యువకుడి మృతి


మృతి చెందిన భార్గవ్ (ఫైల్‌ఫొటో)

భీమునిపట్నం, జూన్ 22 : పట్టణంలోని ఎగువపేటకు చెందిన అల్లిపిల్లి భార్గవ్ (27) ర్యాబిస్ వ్యాధితో శనివారం మృతి చెందాడు. తన ఇంట్లోని పెంపుడు కుక్క ఇటీవల అతని ముఖంపై కరిచింది. ఇంట్లో కుక్కే కదా అని చికిత్స తీసుకోలేదు. మూడు రోజుల తరువాత ఇంజక్షన్ వేసుకున్నాడు. అప్పటికే శరీరమంతా విషం వ్యాపించింది. శుక్రవారం సాయంత్రం ఆరోగ్యం క్షీణించడంతో బీచ్ రోడ్‌లో వున్న ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అప్పటికే జాండిస్ పెరిగిపోవడం, లివర్, బ్రెయిన్ తదితర శరీర భాగాలకు ర్యాబిస్ సోకడంతో అదే రోజు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు.

కుర్చీ వదలరా!?

... 5వ పేజీ తరువాయి

వర్సిటీలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినప్పటికీ వీరంతా ఇంకా కొనసాగుతుండడం గమనార్హం.

జాబితా పెద్దదే..

ఏయూలో పదవీ విరమణ తరువాత కీలక స్థానాల్లో చేరిన ప్రొఫెసర్ల జాబితా పెద్దదే ఉంది. వీరిలో ఓఎస్‌డీగా కొనసాగుతున్న ప్రొఫెసర్ కృష్ణమోహన్ ముందు వరుసలో ఉన్నారు. పదవీ విరమణ తరువాత మూడుసార్లు రిజిస్ట్రార్‌గా ఆయన కొనసాగారు. ఆ తరువాత కూడా ఆయన్ను వర్సిటీలోనే ఉంచేందుకు ఉన్నతాధికారి ఇప్పటి వరకూ ఎన్నడూ లేనివిధంగా ఓఎస్‌డీ (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ)గా నియమించారు. ఇప్పటికీ అదే పోస్టులో ఆయన కొనసాగుతున్నారు. అలాగే, సోషల్ వర్క్ డిపార్టుమెంట్‌లో సీనియర్ ప్రొఫెసర్‌గా, విభాగాధిపతిగా పనిచేసి పదవీ విరమణ పొందిన ప్రొఫెసర్ విశ్వేశ్వరరావును దూర విద్యా కేంద్రం డైరెక్టర్‌గా నియమించారు. ఇదే కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేసిన, యూనివర్సిటీకి సంబంధం లేని ప్రొఫెసర్ ఎంవీఎస్ చంద్రశేఖర్‌రావును నియమించారు. ఇదే కేంద్రంలో కీలక బాధ్యతలను ఆర్ట్స్ అండ్ కామర్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసి పదవీ విరమణ పొందిన జి.సత్యనారాయణకు అప్పగించారు. అదేవిధంగా సోషల్ వర్క్ డిపార్టుమెంట్‌లో పదవీ విరమణ చేసిన ప్రొఫెసర్ శోభశ్రీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీ ఇన్ ఎడ్యుకేషన్ (ఐఏఎస్ఈ) డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఇంజనీరింగ్ కాలేజీలో మరో రిటైర్డ్ ప్రొఫెసర్‌ను ఓఎస్‌డీగా నియమించారు.

సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ డైరెక్టర్‌గా మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నిరంజన్ కొనసాగుతున్నారు. వీరంతా పదవీ విరమణ తరువాత ఆయా స్థానాల్లో నియమితులై రెండు, మూడేళ్ల నుంచి కొనసాగుతున్నారు. వీరిలో ఒకరిద్దరు రాజీనామా చేసినట్టు చెబుతున్నారు. అయితే, ఇంకా బయటకు రాలేదు. మరికొంతమంది అదే ఆలోచనలో ఉండగా, కొందరు మాత్రం ప్రభుత్వం తప్పించేంత వరకు వేచి ఉండాలని భావిస్తున్నట్టు తెలిసింది.

వారి లెక్క తేలాల్సిందే..

ఏయూ వీసీ ప్రసాదరెడ్డి తనకు కావాల్సిన చాలామందిని కీలక స్థానాల్లో కూర్చోబెట్టారని, అస్మదీయులకు ఉద్యోగ కల్పన కేంద్రంగా వర్సిటీని మార్చారన్న విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలోనే అనేక విభాగాల్లో గౌరవ ప్రొఫెసర్లు పేరుతో పదుల సంఖ్యలో రిటైర్డ్ ప్రొఫెసర్లను నియమించారు. అలాగే, ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ పేరుతో అనేకమందికి అవకాశాలు కల్పించారు. వీరిపైనా ప్రభుత్వం దృష్టిసారించాల్సి ఉందంటున్నారు.





గుర్రంపాలెం పాఠశాలను తనిఖీ చేస్తున్న డీఈవో

బడిఈడు పిల్లలు పాఠశాలల్లో ఉండాలి

జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ

పెందుర్తి, జూన్ 22: బడిఈడు పిల్లలంతా బడి బాట పట్టేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ సూచించారు. మండల పరిధిలోని వేపగుంట, గుర్రమ్మపాలెం, బందవానిపాలెం లోని ఎంపీపీ పాఠశాలలను శనివారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులను పరిశీలించి విద్యార్థుల హాజరు శాతంపై ఆరా తీశారు. విద్యా కిట్‌ల పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. చిన్నారుల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు నైపుణ్యతతో కూడిన బోధనను అందించాలని కోరారు. బడిఈడు పిల్లలను గుర్తించి గ్రామ పెద్దల సహకారంతో వారిని పాఠశాలల్లో చేర్పించాలన్నారు. బడికి పోదాం కార్యక్రమంపై స్థానికులకు అవగాహన కల్పించారు.

శత శాతం అక్షరాస్యతే లక్ష్యం

గాజువాక, జూన్ 22: శత శాతం అక్షరాస్యతే లక్ష్యంగా తాము ముందుకు సాగుతున్నామని పెదగంట్యాడ ఎంఈవో ఈశ్రీనివాసరావు అన్నారు. గాజువాక జోనల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 13వ తేదీ వరకు బడిఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించడం జరుగుతుందని, దీనికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈవోలు సునీత, విశ్వనాథం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

63వ వార్డులో వీధి దీపాల వెలుగులు



చింతలలోవలో వెలుగుతున్న లైటు

సింధియా, జూన్ 22: జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతలలోవ, ఆకులవీధిలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రయ్యేసరికి ఆయా ప్రాంతాల్లో చీకటి రాజ్యమేలుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. దీంతో స్థానికులు పలువురు కార్పొరేటర్ గల్లా చిన్న దృష్టికి ఈ సమస్యలను తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడారు. ఈ మేరకు సంబంధిత సిబ్బంది వచ్చి ఆయా ప్రాంతాల్లో వీధి లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలి

పెదగంట్యాడ, జూన్ 22: జీవీఎంసీ 64వ వార్డు పరిధి యాతపాలెం ప్రధాన రోడ్డును యాతపాలెం ఆటో స్టాండ్ జంక్షన్ నుంచి భూలోకమాంబ కూడలి వరకు వేశారు. మిగిలిన భాగం వేయలేదని, దీనిని వెంటనే పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కార్పొరేటర్, జనసేన డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దల్లి గోవిందరెడ్డికి టీడీపీ 64వ వార్డు బీసీ సెల్ మాజీ అధ్యక్షుడు సంపంగి సూరిబాబుకు వినతిపత్రం అందజేశారు. అలాగే పల్లివీధిలో నూతనంగా ఒక కమ్యూనిటీ హాల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ రెండు పనులు చేయించేందుకు కృషి చేస్తానని గోవిందరెడ్డి హామీ ఇచ్చారని సూరిబాబు తెలిపారు.

'అక్షయపాత్ర'కు వాహనం అందజేత

ఆటోనగర్, జూన్ 22: జీవీఎంసీ 88వ వార్డు పరిధి యాదవ జగ్గరాజుపేట సమీపంలో ఉన్న బీడీఎల్ (భారత డైనమిక్స్ లిమిటెడ్) యాజమాన్యం సీఎస్ఆర్ నిధులను వినియోగించి శనివారం అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రతినిధి అంబరీష దాస్‌కు భోజన సరఫరా నిమిత్తం సుమారు రూ.12 లక్షల విలువ చేసే విద్యుత్‌తో నడిచే కాలుష్య రహిత వాహనాన్ని వితరణగా అందజేశారు. దేశవ్యాప్తంగా అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా సుమారు 21 లక్షల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనంను అందిస్తున్నారు. కార్యక్రమంలో బీడీఎల్ జీఎం ఆర్.సింహాచలం, డీజీఎం విక్రమ్, ఏజీఎం శ్రీధర్‌సింగ్, అక్షయపాత్ర ఫౌండేషన్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పుచ్చకాయల విక్రయదారునిపై దాడి

గాజువాక, జూన్ 22: శ్రీనగర్ సంతలో పుచ్చకాయలు విక్రయిస్తున్న వ్యక్తిపై ఇద్దరు వ్యక్తులు మద్యం మత్తులో దాడి చేయడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. అయితే వీరి మధ్య ఎందుకు ఘర్షణ చోటు చేసుకుందో తెలియరాలేదు. గాయపడిన వ్యక్తి గాజువాకలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దాడికి పాల్పడిన వారిలో ఒకరికి గాజువాక పోలీసులు అదుపులోకి తీసుకోగా, మరో వ్యక్తి పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉక్కు శాఖ సహాయమంత్రిని కలిసిన ఉక్కు బీఎంఎస్ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 22: స్టీల్‌ప్లాంట్‌కు అన్ని విధాల సహాయ సహకారాలను అందించి పూర్వ వైభవం తీసుకురావాలని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను ఉక్కు బీఎంఎస్ నాయకులు కోరారు. భీమవరంలో శనివారం కేంద్ర మంత్రిని కలిసి పలు సమస్యలను విన్నవించారు. ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, ఉద్యోగుల సంఖ్య పెంచాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, ఉక్కు ఉత్పత్తి పూర్తి స్థాయిలో జరిపేందుకు సహకరించవలసిందిగా వేడుకున్నారు. ఆయా సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారని, త్వరలోనే స్టీల్‌ప్లాంట్ పర్యటనకు వస్తానని చెప్పారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొమ్మినేని శ్రీనివాసరావు, హనుమంతరావు, హరీశ్ వర్మ, రామస్వామి, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి ఎంపీని కలిసిన ఉక్కు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు

అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌ను ఉక్కు కార్మిక, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు అనకాపల్లిలో కలిసి కర్మాగారంలో నెలకొన్న ప్రధాన సమస్యలను విన్నవించారు. విశాఖ, అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో ప్లాంట్ ఉన్నందున దీని పరిరక్షించేందుకు కృషి చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంటుకు అన్నివిధాల సహకారాన్ని అందిస్తామని ఎంపీ చెప్పినట్లు నాయకులు పేర్కొన్నారు. ఎంపీని కలిసిన వారిలో బయ్యే మల్లయ్య, కేఎస్ఎన్.రావు, వి.రామ్మోహన్‌కుమార్, కామేశ్వరరావు ఉన్నారు.

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ Iలో..



ఐలా కార్యాలయం వైపు వెళ్లే ప్రమాదకరమైన మలుపు



చుక్కవానిపాలెం రైల్వే గేటు వైపు వెళ్లే మార్గంలో ఉన్న డేంజరస్ టర్నింగ్

ఆ మలుపుల్లో జర భద్రం

తుంగ్లాం, రాజధాని కాటా, గ్రోదేజ్ జంక్షన్, చుక్కవానిపాలెం రైల్వే క్రాసింగ్ ప్రాంతాల్లో డేంజరస్ టర్నింగ్స్

తరచూ ప్రమాదాలతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు భీతిల్లుతున్న వాహనదారులు

అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వేడుకోలు

ఆటోనగర్, జూన్ 22: ఆటోనగర్ పారిశ్రామిక ప్రాంతంలోని పలు మలుపులు ప్రమాదానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నాయి. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. ప్రమాదకర మలుపులతో పాటు ఎక్కడికక్కడ ఆయా రోడ్లు గోతులతో నిండిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని మలుపుల్లో సమీపానికి వాహనం వస్తే గానీ తెలియని పరిస్థితి నెలకొందని, దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుంగ్లాం జంక్షన్ నుంచి ఐలా కార్యాలయానికి వెళ్లే మలుపు మార్గంలో ఎదురుగా వచ్చే వాహనాలు బాగా దగ్గరకు వస్తేగానీ కనిపించని పరిస్థితి నెలకొంది.



రాజధాని కాటా వద్ద మలుపు మార్గం

దీంతో మలుపు తిరుగుతున్న భారీ వాహనాల వద్ద ద్విచక్ర వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ రోడ్డు మార్గానికి ఇరుపక్కలా గడ్డర్‌లను ఏర్పాటు చేసి భారీ వాహనాల రాకపోకలను నిలిపివేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే రాజధాని కాటా వద్దనున్న మలుపు మార్గంలో ట్రాఫిక్ కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. ఇక్కడ జరిగిన పలు ప్రమాదాల్లో పలువురు మృతి చెందగా, ఇంకొందరు క్షతగాత్రులుగా మారారు. ఆటోనగర్ గోద్రేజ్ జంక్షన్ కూడా ఈ కోవలోకే వస్తుంది. గతంలో ఇక్కడి మలుపులో జరిగి ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, పలువురు గాయాలపాలయ్యారు. కాగా రాజధాని కాటా వద్దనున్న కూడలిలో ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టినప్పటికీ, ఇక్కడ మాత్రం ట్రాఫిక్ సమస్యలను అరికట్టలేకపోతున్నారు. సరకుల తూకం కోసం వస్తున్న భారీ వాహనాలు రోడ్డును ఆక్రమించేస్తున్నాయిం. దీంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం వాటిల్లుతుండడంతో వాహనదారులు నానాపాట్లు పడుతున్నారు. అదేవిధంగా చుక్కవానిపాలెం రైల్ క్రాసింగ్ గేటుకు వెళ్లే మలుపు మార్గం ప్రమాదాలకు నిలయంగా మారడంతో వాహనదారుల అవస్థలు వర్ణనాతీతంగా మారింది. ఆయా మలుపుల వద్ద ఎటువంటి ప్రమాద సూచికలు గానీ స్పీడ్ బ్రేకర్లు కానీ లేవు. కొన్నిచోట్ల స్పీడ్ బ్రేకర్లు ఉన్నా అవి రోడ్డు రంగులో కలిసిపోవడంతో వాహనాలపై స్పీడుగా వచ్చే వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రహదారి నిబంధనల మేరకు స్పీడ్ బ్రేకర్లకు రేడియం రంగులు వేయాలని పలువురు వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. తుంగ్లాం గ్రామానికి వెళ్లే మార్గంలో గోడను ఆనుకుని ఉన్న ఉన్న మలుపులో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అందువల్ల అధికారులు ఆయా మలుపుల వద్ద ప్రమాద సూచిక బోర్డులను పెట్టడంతో పాటు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని పలువురు పారిశ్రామిక వేత్తలు, కార్మికులు కోరుతున్నారు.

కార్మిక హక్కుల రక్షణకు నిరంతరం పోరాటాలు

సీఐటీయూ జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 22: కార్మిక హక్కుల రక్షణ కోసం నిరంతరం పోరాటాలు చేయాలని సీఐటీయూ జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. సీఐటీయూ ప్లాంట్ కార్యాలయంలో కార్మికులకు రెండు రోజుల పాటు జరగనున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చాక కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్స్‌ను అమలులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తుందన్నారు. స్టీల్ ప్లాంటుకు సొంత గనులు కేటాయించకుండా ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రం దిగడం సమంజసం కాదన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ఆర్థికంగా ఆదుకోవాల్సింది పోయి ఉన్న ఆస్తులను అమ్మడం దుర్మార్గమన్నారు. ప్లాంట్ పరిరక్షణకు, కార్మిక హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ పోరాటాలు సాగించాలని జగ్గునాయుడు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, జగన్, అప్పలరాజు, మణి, వెంకటరెడ్డి, కుమారమంగళం, శ్రీనివాసరాజు, రమణ, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమానికి హాజరైన కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న జగ్గునాయుడు

ఉక్కు పరిరక్షణలో యువత భాగస్వాములవ్వాలి

పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ

కూర్మన్నపాలెం, జూన్ 22: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణలో యువత భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1227వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు విఘాతం కలిగించే ప్రభుత్వరంగ సంస్థల విక్రయానికి పూనుకున్న ప్రభుత్వాలపై ప్రజలు పోరాడాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు అందరూ ముందుకు రావాలన్నారు. నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉక్కును కాపాడుకోవడానికి ప్రజలు, విద్యార్థులు, మేధావులతో పాటు కార్మిక వర్గమంతా పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. నాయకుడు నీరుకొండ రామచంద్రరావు మట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్రం పూనుకోవడం కార్మికుల కడుపు కొట్టడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమై కేంద్రం ఉక్కు ప్రైవేటీకరణ ప్రక్రియను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



దీక్షా శిబిరంలో పోరాట కమిటీ నాయకులు



కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ బొండా జగన్

ఘనంగా బొండా జగన్ జన్మదిన వేడుకలు

కూర్మన్నపాలెం, జూన్ 22: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ జన్మదిన వేడుకలను శనివారం టీడీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు నడుమ ఘనంగా నిర్వహించారు. కేకు కటింగ్ అనంతరం పూలమాలలతో ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం అమ్మవారి పూజల్లో బొండా జగన్ పాల్గొన్నారు. ఇందులో భాగంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బొండా జగన్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వానికి కార్యకర్తలే వెన్నెముక అని అన్నారు. తన పుట్టినరోజు వేడుకలకు విచ్చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రౌతు శ్రీనివాసరావు, మొల్లి ముత్యాలనాయుడు, నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, బలిరెడ్డి నాగేశ్వరరావు, శ్రీనివాస నాయుడు, రాజన్‌రాజు, అప్పారావు, రాంబాబు, దానయ్య, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా నేరేడు పండ్ల విక్రయాలు



గోపాలపట్నం, జూన్ 22: నేరేడు పండ్లు, పైనాపిల్ విక్రయాలు జోరందుకున్నాయి. పెద్ద పరిమాణంలోని నేరేడు పండ్లు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి దిగుమతవుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. నేరేడు పండ్లు కిలో రూ.200 నుంచి రూ.250 వరకు విక్రయిస్తున్నారు. ధర ఎక్కువైనా వీటిలో ఆరోగ్యానికి ఎంతో మేలుచేసే ఔషధ గుణాలుండడంతో వీటి కొనుగోలుకు జనాలు ఆసక్తి చూపుతున్నారు.

ఏజెన్సీ నుంచి పైనాపిల్..

విశాఖ ఏజెన్సీతోపాటు శ్రీకాకుళం నుంచి పైనాపిల్ పెద్ద మొత్తంలో దిగుమతవుతున్నాయి. ప్రస్తుతం రైతుబజారులో శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఏజెన్సీ నుంచి తీసుకువచ్చిన పైనాపిల్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కిలో పైనాపిల్ రూ. 35 నుంచి 38 రూపాయల చొప్పున విక్రయిస్తున్నారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న విజ్ఞాన్, బీఎస్ఎన్ఎల్ ప్రతినిధులు

బీఎస్ఎన్ఎల్‌తో 'విజ్ఞాన్' ఎంవోయూ

అగనంపూడి, జూన్ 22: దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు శిక్షణ, నైపుణ్యం, విజ్ఞానాన్ని పెంపొందించేందుకు గాను బీఎస్ఎన్ఎల్‌తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకున్నది. ఈ మేరకు శనివారం బీఎస్ఎన్ఎల్ డీజీఎం ఎం.సత్యప్రసాద్, విజ్ఞాన్ కళాశాల యాజమాన్య ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ జె.సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య నైపుణ్యంతో కూడిన శిక్షణ అందించాలనే లక్ష్యంతో ఈ ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. టెలీ కమ్యూనికేషన్ రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, సిబ్బంది ఆర్.ఉమామహేశ్వరరావు, సంపత్ దక్షిణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అతిసారపై అప్రమత్తం: కమిషనర్

విశాఖపట్నం, జూన్ 22: నగరంలో అతిసార వ్యాధి ప్రబలకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ఆదేశించారు. శనివారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం దేశవ్యాప్తంగా చేపట్టిన 'స్టాప్ డయేరియా' ప్రచార కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలో అతిసార వ్యాధి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని అతి సారతో పాటు మలేరియా, డెంగ్యూ, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. డిసిల్టింగ్ ఆఫ్ డ్రైన్స్ కార్యక్రమం ముమ్మరంగా చేపట్టాలని, నగరంలో 10.19 కిలోమీటర్ల మేర ఉన్న ప్రధాన గెడ్డల్లోని పూడికలను తొలగించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అలాగే 28.90 కిలోమీటర్ల మేర ఉన్న చిన్న కాలువల్లోని పూడికలను కూడా తొలగించాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. దోమలు వృద్ధి చెందకుండా యాంటీ లార్వా ఆపరేషన్‌ను విస్తృతంగా చేపట్టాలని, ప్రతి వారం తప్పనిసరిగా కాలువల్లో స్ప్రేయింగ్, వీధులు, కాలనీల్లో ఫాగింగ్, చెరువుల్లో గంబూషియా చేపల విడుదల తదితర కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వారంలో ఒకరోజు డ్రై డే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

సమాజాభివృద్ధే వాసవీ క్లబ్ లక్ష్యం

అగనంపూడి, జూన్ 22: సమాజాభివృద్ధే వాసవీ క్లబ్ లక్ష్యమని క్లబ్ అంతర్జాతీయ అధికారి అడగళ్ల సునీత అన్నారు. ఇక్కడి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ పాఠశాలలోని చిన్నారులకు స్టేషనరీ అందజేశారు. ఫుట్‌పాత్ వ్యాపారులకు ఉచితంగా గొడుగులను, ట్రాఫిక్ సిబ్బందికి తువ్వాళ్లను అందించారు. క్లబ్ ప్రతినిధులు మయూరి బుజ్జి, వెంకటరత్నం, మహర్షి, గున్నయ్యశెట్టి, గురునాథ్, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.



జగన్నాథస్వామి పూజల్లో పాల్గొన్న భక్తులు

వైభవంగా జగన్నాథస్వామికి జ్యేష్ఠాభిషేకం

అగనంపూడి, జూన్ 22: ఇక్కడి సత్రం జంక్షన్‌లో కొలువుదీరిన జగన్నాథస్వామి రథోత్సవాలను పురస్కరించుకుని శనివారం స్వామివారికి జ్యేష్ఠాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. వేకువజామున ఆలయ అర్చకులు జగన్నాథ, బలభద్ర, సుభద్రలను నూతన వస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, 108 కలశాలు, కొబ్బరిబొండాలతో అభిషేకాలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయంలో భజనతో పాటు భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గొల్లవిల్లి వెంకటరావు, గురు త్రినాథ్, మోహన్, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

గవరపాలెం గీతాకృష్ణ మందిరంలో..

పెందుర్తి రూరల్: గ్రేటర్ 95వ వార్డు పరిధి లక్ష్మీపురం గవరపాలెం కాలనీలోని గీతా కృష్ణ మందిరంలో జగన్నాథస్వామి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త ఆళ్ల తాతారావు ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో సుభద్ర, బలబద్ర సమేత జగన్నాథస్వామిని ఆశీనులు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉత్సవమూర్తులకు స్నానమాచరించి పూజలు చేశారు. కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు. మాజీ ఎంపీపీ కాళ్ల వరలక్ష్మి, సర్పంచ్ గోపి అప్పలనాయుడు పాల్గొన్నారు.

87వ వార్డులో బోరింగులు ప్రారంభం

కూర్మన్నపాలెం, జూన్ 22: జీవీఎంసీ 87వ వార్డు పరిధి సిద్ధార్థనగర్‌లో శనివారం కార్పొరేటర్ బొండా జగన్ నూతనంగా ఏర్పాటు చేసిన బోరింగులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్లపూడి, లక్ష్మీపురం కాలనీ, శెట్టిబలిజ వీధుల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు గాను కొత్తగా బోరులను ప్రారంభించామన్నారు. ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయమన్నారు. టీడీపీ నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్‌రాజు, సత్తిబాబు, కాలనీవాసులు నాగేశ్వరరావు, మూర్తి, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు స్టోర్సులో కార్మిక చట్టాలను అమలు చేయాలి'

అగనంపూడి, జూన్ 22: స్టీల్‌ప్లాంట్ స్టోర్సులో కార్మిక చట్టాలను అమలు చేయాలని సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త, ఉక్కు స్టోర్స్ మాజీ కార్యదర్శి పట్టా రామ అప్పారావు డిమాండ్ చేశారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 28 ఏళ్లుగా స్టోర్సులో క్యాజువల్ కార్మికులుగా పనిచేస్తున్న వారికి కార్మిక చట్టాలు అమలు చేయకపోవడంతో పనికి తగ్గ వేతనాలు అందడం లేదని ఆరోపించారు. స్టోర్స్ నడిపేది కార్మిక సంఘాల నేతలే అయినప్పటికీ కార్మికుల సమస్యలు పట్టడలేదని విమర్శించారు. తక్షణమే స్టోర్సులో కార్మిక చట్టాలను అమలు చేయకపోతే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఉక్కు స్టోర్సుకు ఎగ్జిక్యూటివ్ అధికారి లేకుండా ఇన్‌చార్జితోనే నడుపుతుండడం సమంజసం కాదని, తక్షణమే శాశ్వతంగా బిజినెస్ మేనేజర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నిమ్మకూరి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

IN THE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISION) :: AT KAIKALUR.

O.S.No.107/2023.

Between:
Chaparala Venkata Ratnam. ...Plaintiff.
And
1. Kosaraju Venkata Sitamma and 7 others. ... Defendants.

To,
D3. Chaparala Rajani, W/o. Late Vijayaramudu,
D4. Chaparala Sesha Sai, S/o. Late Vijayaramudu,
D5. Vemulapalli Padmaja, W/o. Srinivasa Rao,
The defendants 3 to 5 are residing at CHVR Transport, D.No.7-14-57, SRMT Canteen Road, Chittinaidu Colony, Old Gajuwaka, Chaitanya Nagar, Auto Nagar, Visakhapatnam, Visakhapatnam JCJC.

పై నెంబరు దావాసు వాది ప్రతివాదుల పై పార్టీషన్ నిమిత్తం దాఖలు చేసియున్నారు. సదరు దావాలో 3 టూ 5 ప్రతివాదులకు శ్రీ కోర్టు వారి నుండి ఎన్నిసార్లు దావా సమన్లు మరియు ఐ.ఎ.నెం. 179/2023 రులో నోటీసులు పంపినను 3 టూ 5 ప్రతివాదులు పుచ్చుకొనక కాలయాపన చేయుచున్నందున పబ్లికేషన్ ద్వారా దావా సమన్లు మరియు ఐ.ఎ.నెం. 179/2023 రులో నోటీసులు అమలుకు శ్రీ కోర్టువారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. సదరు ఉత్తర్వుల ప్రకారం మీరు ది. 01.07.2024వ తేదీన ఉదయం 10:30 గం.లకు పై కోర్టునందు స్వయముగా గానీ, వకీలు గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలున్న తెలుపుకొనవలెను. లేని యెడల మీపరోక్షమున తదుపరి ఉత్తర్వులు పొందబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 01.07.2024.
పి.పవన్ కాంత్, వాది తరపు న్యాయవాది, సెల్ : 94903 39161.

జూలై 27న అంబేడ్కర్ ఆలోచనా ఫౌండేషన్ వర్క్‌షాప్

డాబాగార్డెన్స్, జూన్ 22: అంబేద్కర్ ఆలోచనా ఫౌండేషన్ 17వ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ జూలై 27న కాకినాడలోనిర్వహిస్తున్నట్టు రాష్ట్ర కన్వీనర్ బైపా అరుణ్ కుమార్ , రాష్ట్ర అధ్యక్షుడు పినిపే వెంకటరామకృష్ణ తెలిపారు. శుక్రవారం బీపీకే చాంబర్స్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.న్యాయవాదులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్, ఆర్థిక సాయం, ఇళ్లస్థలాలు కేటాయించాలని ప్రభుత్వాన్నికోరారు.న్యాయవాదులు టి.బోసుబాబు, వి.చిన్నారావు, బి.కృష్ణారావు, పి.చలపతి, నాగకుమారితదితరులు పాల్గొన్నారు





సత్యనారాయణ స్వామి ఆలయంలో పౌర్ణమి పూజలు

మహారాణిపేట, జూన్ 22: ఇసుక కొండపై వేంచేసిన శ్రీ రమా సత్యనారాయణకి పౌర్ణమి పూజలు వైభవంగా జరిపారు. వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం జ్యేష్ట పౌర్ణమి పురస్కరించుకుని స్వామి వా రికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు సామూహిక సత్య వ్రతాలు నిర్వహించారు. భక్తులు ధ్వజ స్తంభం ప్రదక్షిణలు చేశారు. భీమిలి శాసన సభ్యుడు గంటా శ్రీనివాసరావు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బుద్దా మహలక్ష్మి నగేష్ భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదం అందించారు. ఆదివారం ఉదయం స్వామి వారికి పుష్పయాగం అనంతరం పవళింపు సేవతో కళ్యాణ మహోత్సవాలు ముగియనున్నట్లు ఈవో తెలిపారు.


అలంకరణలో స్వామివారు


సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాల్లో భక్తులు

ఏయూ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఎంవీఆర్ రాజు

మహిళా ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఆర్.పద్మశ్రీ

విశాఖపట్నం, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సైకాలజీ విభాగానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు నియమితులయ్యారు. శనివారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజుకు ఏయూ మాజీ వీసీలు ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, ప్రొఫెసర్ జి.నాగేశ్వరరావు, శ్రీకాకుళంలోని అంబేడ్కర్ విశ్వ విద్యాలయం మాజీ వీసీ ప్రొఫెసర్ రాంజీ, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నరసింహరాజు, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శశిభూషణ్‌తోపాటు ఇతర అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. సైన్స్ అండ్ టెక్నాలజీ కళా శాల ప్రిన్సిపాల్‌గా ఉన్న కె.శ్రీనివాసరావు రాజీనామా చేయ డంతో ఆయన స్థానంలో ఎంవీఆర్ రాజు బాధ్యతలు చేపట్టారు. అలాగే, మహిళా ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సి పాల్‌గా ప్రొఫెసర్ ఆర్.పద్మ నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు రావడంతో ఆమె శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఆ స్థానంలో కొనసాగిన ప్రొఫెసర్ కె.భట్టి రాజీనామా చేశారు.

సేఫ్టీ కోర్సుల శిక్షణ అభ్యర్థులు స్టీల్ ప్లాంట్ సందర్శన

కంచరపాలెం, జూన్ 22 : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫైర్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ సేఫ్టీ కోర్సులో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు శనివారం ఇండస్ట్రియల్ టూర్‌లో భాగంగా స్టీల్ ప్లాంట్‌ను సందర్శించారు. ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ ఆధ్వర్యంలో 30 మంది అభ్యర్థులు స్టీల్‌ప్లాంట్‌లో పలు విభాగాలను సందర్శించి వివరాలను తెలుసుకున్నారు. స్టీల్ ఉత్పత్తి, బ్లాస్ట్ ఫర్నేసర్, లెర్నింగ్ &డెవలప్‌మెంట్ సెంటర్ తదితర కేంద్రాలను సందర్శించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇటువంటి పర్యటన వల్ల శిక్షణ పొందుతున్న అభ్యర్థులు నైపుణ్యాలను పెంచుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డా.బీవీ లక్ష్మణరావు, కె.వరహాలు పాల్గొన్నారు.

ఐటీఐలో మిగులు సీట్లకు రేపటి నుంచి కౌన్సెలింగ్

కంచరపాలెం, జూన్ 22 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2024-2025 విద్యాసంవత్సరంగాను ప్రవేశాల ప్రక్రియ ఈనెల 19వ తేదీ నుంచి జరుగుతున్న సంగతి తెలిసిందే. మొదటి విడత కౌన్సెలింగ్‌లో ఆదివారం వరకు భర్తీకాని సీట్లకు గాను ఈనెల 24, 25, 26 తేదీల్లో మళ్లీ కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్టు జిల్లా ఐటీఐల కన్వీనర్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈనెల 24న ఉదయం 8కు స్టీల్ ప్లాంట్ భూ బాధితులకు కేటాయించిన భర్తీకాని సీట్లు, బాలికలు, ఎక్స్ సర్వీస్ మెన్, దివ్యాంగులు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు తదితర కేటగిరీలకు మొదటి ర్యాంకు నుంచి 3398 ర్యాంకు వరకు, జనరల్ అభ్యర్థులకు మొదటి ర్యాంకు నుంచి 892 ర్యాంకు వరకు గల వారికి కౌన్సెలింగ్ ఉంటుంది.. ఈ నెల 25న 893 ర్యాంకు నుంచి 2309 ర్యాంకు వరకు, 26న 2310 ర్యాంకు నుంచి 3398 ర్యాంకు వరకు గల అభ్యర్థులకు కౌన్సెలింగ్‌ను చేపట్టనున్నారు. సీట్లు పొందని మెరిట్ విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

త్రిశక్తి వైభవంపై ప్రవచనాలు


అభిభాషణ చేస్తున్న భారతీ స్వామిని

అక్కయ్యపాలెం, జూన్ 22: గురుదేవుల ఆరాధనోత్సవాల్లో భాగంగా లలితా పీఠంలో శ్రీ శక్తి పీఠాధిపతి మంత్ర మహేశ్వరి రమ్యానంద భారతీ స్వామిని త్రిశక్తి వైభవంపై శనివారం రాత్రి ప్రవచనం చేశారు. దేవీ భాగవతం, కాళీ పురాణంలో అమ్మవారి వైభవ విశేషాలు ఎన్నో ఉన్నాయని చెప్పారు. కాళీ రూపంలో అమ్మవారు పరమేశ్వరుడికి ప్రియమైన స్వరూపమన్నారు. శివశక్తి అభేద్యమని, కాళీమాత వాక్ శక్తినిచ్చే దేవతని, సమస్త శక్తుల సమూహారం మహాకాళి అని వివరించారు. మాత అలంకారాలను, ఆయుధాలను పేర్కొన్నారు. కుర్తాళం శంకరాచార్య సిద్ధేశ్వరానంద భారతీ స్వామి సమక్షంలో నిర్వహించిన ఈ ప్ర వచన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశా రు. ఈ కార్యక్రమం పీఠం కార్యనిర్వహణాధికారి మ న్నవ కృష్ణ సేన్ సారథ్యంలో జరిగింది.

పుస్తకాలు, బ్యాగులు పంపిణీ


కిట్లు అందిస్తున్న కార్పొరేటర్ వసంతలక్ష్మి

జ్ఞానాపురం, జూన్ 22: విద్యార్థులు డ్రాప్అవుట్స్ లేకుండా చూడాలని 33వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి కోరారు. ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పుస్తకాలు, బ్యాగులను శనివారం 33వార్డు పరిధి న్యూ మోడల్ స్కూల్‌లో కార్పొరేటర్ అందించారు. 1వతరగతి నుంచి 5వ తరగతి చదువుతున్న వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.అరుణలక్ష్మి, బి.వినోద్, వార్డు జనసన అధ్యక్షులు ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు. జ్ఞానాపురంలోని సెక్రడ్ హార్ట్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు టీడీపీ వార్డు అధ్యక్షుడు ఐతి మధుబాబు పాఠ్యపుస్తకాలు, బ్యాగుల కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐతి రవిబాబు, క్లస్టర్ ఇన్‌చార్జి సానిబాని ఫ్రాన్సిస్, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

ర్యాబిస్ వ్యాధితో యువకుడి మృతి


మృతి చెందిన భార్గవ్ (ఫైల్‌ఫోటో)

భీమునిపట్నం, జూన్ 22 : పట్టణంలోని ఎగువపేటకు చెందిన అల్లిపిల్లి భార్గవ్ (27) ర్యాబిస్ వ్యాధితో శనివారం మృతి చెందాడు. తన ఇంట్లోని పెంపుడు కుక్క ఇటీవల అతని ముఖంపై కరిచింది. ఇంట్లో కుక్కే కదా అని చికిత్స తీసుకోలేదు. మూడు రోజుల తరువాత ఇంజక్షన్ వేసుకున్నాడు. అప్పటికే శరీరమంతా విషం వ్యాపించింది. శుక్రవారం సాయంత్రం ఆరోగ్యం క్షీణించడంతో బీచ్‌రోడ్‌లో వున్న ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అప్పటికే జాండిస్ పెరిగిపోవడం, లివర్, బ్రెయిన్ తదితర శరీర భాగాలకు ర్యాబిస్ సోకడంతో అదే రోజు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు.

టిడ్కో ఇళ్ల అక్రమాలపై విచారణ జరపాలి

▸▸ 39 వార్డు కార్పొరేటర్ సాధిక్ డిమాండ్



పూర్ణామార్కెట్, జూన్ 22: వన్‌టౌన్ సీహార్స్ వద్ద టిడ్కో ఇళ్ల కేటాయింపులో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని దక్షిణ జనసేన నాయకుడు, 39వ వార్డు కార్పొరేటర్ సాధిక్ డిమాండ్ చేశారు. శనివారం వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ సౌత్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్, యూసీడీ అధికారులు సీహార్స్ వద్ద టిడ్కో ఇళ్లలో కేటాయింపులో అక్రమాలకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. స్థానికులకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. పేదవర్గాలకు కేటాయించాల్సిన ఇళ్లను మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి తన అనుయాయులకు కేటాయించారని అన్నారు. ఇలా దక్కించుకున్న టిడ్కో ఇళ్లు ఆ లబ్ధిదారులు ఇళ్లు అమ్ముకున్నారని, తక్షణం దీనిపై విచారణ జరపాలని డి మాండ్ చేశారు. సీహార్స్ టిడ్కో ఇళ్ల కేటాయింపులో వైసీపీ అక్రమాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు. యూసీడీ అధికారులు వైసీపీ నాయకులతో కలసి కోట్లాది రూ పాయల అవినీతికి పాల్పడినట్టు స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం బాధ్యులపై చర్యలు దిగాలని కోరారు.

'వాణిజ్య సముదాయాల కేటాయింపులో రిజర్వేషన్లు ఉండాలి '


సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ ప్రతినిధులు

జగదాంబ కూడలి, జూన్ 22: గ్రేటర్ జోన్-4 పరిధిలో వాణిజ్య సముదాయాల కేటాయింపులో రిజర్వేషన్లు పాటించాలని కులవివక్ష పోరాట సంఘం ప్రతినిధులు వై.రాజు, ఎం.సుబ్బారావు డిమాండ్ చేశారు. శనివారం సీటు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు వై.రాజు మాట్లాడుతూ జోన్-4 పరిధిలో డైక్స్ ట్యాంకు, జగదాంబ, పాతబస్టాండ్ ఫేజ్ -2, పద్మానగర్, సూర్యాబాగ్‌లోని వాణిజ్య సముదాయాలు, అంబేడ్కర్ కల్యాణ మండపం, ఎస్‌విపీ మార్కెట్, (పూర్ణామార్కెట్), రామకృష్ణా రైతుబజారు, రెల్లివీధి చేపల మార్కెట్‌లో ఆశీలు వసూలు కోసం 28 తేదీన నిర్వహించే బహిరంగ వేలం పాటలో రిజర్వేషన్లు పాటించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, వాణ్యి సముదాయాల కేటాయింపులో స్థానికులకు, ఆయా వృత్తుల వారికి ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఆశీల వేలం పాట పారదర్శంగా జరిగేలా జోల్ కమీషనర్ ప్రసాదరావు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఇప్పటి వరకు ఆశీలు వసూలు కాంట్రాక్టర్ నియామకాల్లో నిబంధనలు పాటించలేదని ఆయన ఆరోపించారు.

అర్థవంతమైన బోధనతో విద్యా ప్రమాణాలు పెంపు


కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులతో కమొడోర్ రజిత్‌నాగపాల్

మర్రిపాలెం, జూన్ 22: హైదరాబాద్ రీజియన్ పరిధిలోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోగల వివిధ కేంద్రీయ విద్యాలయాల్లో నియమితులైన సుమారు 50 ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను శనివారం 104 ఏరియా విజయనగర్ కాలనీ కేంద్రీయ విద్యాలయం-2లో ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈస్ట్రన్ నేవల్ కమాండ్ కమొడోర్ రజత్‌నాగపాల్ మాట్లాడుతూ వివిధ అంశాలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాల న్నారు.ఐదురోజులపాటు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమంలో జాతీయ విద్యావిధానం, నిపుణ్‌భారత్, పాలసీ అనుసరణ, నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్ వర్క్, ఉపాధ్యాయుల ప్రవర్తన నియమవళి తదితర అంశాలలో తర్ఫీదు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీ-1,2 ఉపాధ్యాయులు మదీనా మాలిక్, సీహెచ్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు సాహిత్య, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారులో తనిఖీలు


స్టాల్‌లో టమాటాను పరిశీలిస్తున్న ఏడీ యాసీన్

అక్కయ్యపాలెం, జూన్ 22: గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్‌లోని రైతుబజారులో జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ శాఖాధికారి యాసీన్ ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బజారులో డ్వాక్రా, రైతు స్టాళ్లలో ఉల్లి, టమా టాలను ఏ విధంగా విక్రయిస్తున్నారని, వాటి నాణ్యతను పరిశీలించారు. తూకం సరిగ్గా వేస్తున్నారా లేదా అని తనిఖీలు చేశారు. వినియోగదారులకు నాణ్యమైన సరకులు విక్రయించాలని డ్వాక్రా మహిళలను ఆదేశించారు. ఆయనతో పాటు రైతుబజారు ఎస్టేట్ అధికారి పి.చిన్నబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ ఉన్నారు.

కుర్చీ వదలరా!?

... 5వ పేజీ తరువాయి

వర్సిటీలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినప్పటికీ వీరంతా ఇంకా కొనసాగుతుండడం గమనార్హం.

జాబితా పెద్దదే..

ఏయూలో పదవీ విరమణ తరువాత కీలక స్థానాల్లో చేరిన ప్రొఫెసర్ల జాబితా పెద్దదే ఉంది. వీరిలో ఓఎస్‌డీగా కొనసాగుతున్న ప్రొఫెసర్ కృష్ణమోహన్ ముందు వరుసలో ఉన్నారు. పదవీ విరమణ తరువాత మూడుసార్లు రిజిస్ట్రార్‌గా ఆయన కొనసాగారు. ఆ తరువాత కూడా ఆయన్ను వర్సిటీలోనే ఉంచేందుకు ఉన్నతాధికారి ఇప్పటి వరకూ ఎన్నడూ లేనివిధంగా ఓఎస్‌డీ (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ)గా నియమించారు. ఇప్పటికీ అదే పోస్టులో ఆయన కొనసాగుతున్నారు. అలాగే, సోషల్ వర్క్ డిపార్టుమెంట్‌లో సీనియర్ ప్రొఫెసర్‌గా, విభాగాధిపతిగా పనిచేసి పదవీ విరమణ పొందిన ప్రొఫెసర్ విశ్వేశ్వరరావును దూర విద్యా కేంద్రం డైరెక్టర్‌గా నియమించారు. ఇదే కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేసిన, యూనివర్సిటీకి సంబంధం లేని ప్రొఫెసర్ ఎంపీఎస్ చంద్రశేఖర్‌రావును నియమించారు. ఇదే కేంద్రంలో కీలక బాధ్యతలను ఆర్ట్స్ అండ్ కామర్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసి పదవీ విరమణ పొందిన జి.సత్యనారాయణకు అప్పగించారు. అదేవిధంగా సోషల్ వర్క్ డిపార్టుమెంట్‌లో పదవీ విరమణ చేసిన ప్రొఫెసర్ శోభశ్రీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీ ఇన్ ఎడ్యుకేషన్ (ఐఏఎస్ఈ) డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఇంజనీరింగ్ కాలేజీలో మరో రిటైర్డ్ ప్రొఫెసర్‌ను ఓఎస్‌డీగా నియమించారు.

సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ డైరెక్టర్‌గా మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నిరంజన్ కొనసాగుతున్నారు. వీరంతా పదవీ విరమణ తరువాత ఆయా స్థానాల్లో నియమితులై రెండు, మూడేళ్ల నుంచి కొనసాగుతున్నారు. వీరిలో ఒకరిద్దరు రాజీనామా చేసినట్టు చెబుతున్నారు. అయితే, ఇంకా బయటకు రాలేదు. మరికొంతమంది అదే ఆలోచనలో ఉండగా, కొందరు మాత్రం ప్రభుత్వం తప్పించేంత వరకు వేచి ఉండాలని భావిస్తున్నట్టు తెలిసింది.

వారి లెక్క తేలాల్సిందే..

ఏయూ వీసీ ప్రసాదరెడ్డి తనకు కావాల్సిన చాలామందిని కీలక స్థానాల్లో కూర్చోబెట్టారని, అస్మదీయులకు ఉద్యోగ కల్పన కేంద్రంగా వర్సిటీని మార్చారన్న విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలోనే అనేక విభాగాల్లో గౌరవ ప్రొఫెసర్లు పేరుతో పదుల సంఖ్యలో రిటైర్డ్ ప్రొఫెసర్లను నియమించారు. అలాగే, ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ పేరుతో అనేకమందికి అవకాశాలు కల్పించారు. వీరిపైనా ప్రభుత్వం దృష్టిసారించాల్సి ఉందంటున్నారు.

నేడు పోర్టు స్టేడియం కళావాణిలో కల్చరల్ ఫెస్టివల్

▸▸ కల్చరల్ మీట్స్ జిల్లా చైర్మన్ వెంకటేశ్వరరావు


వెంకటేశ్వరరావు

సీతమ్మధార, జూన్ 22: పోలియో నిర్మూలనపై అవగాహన, నిధుల సేకరణకు రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీతోపాటు నగరంలోని 22 రోటరీ క్లబ్‌లు సంయుక్తంగా ఈ నెల 23న పోర్టు స్టేడియం కళావాణిలో కల్చరల్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్టు కల్చరల్ మీట్స్ జిల్లా చైర్మన్ కంటిపూడి వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. రోటరీ ఇంటర్నేషనల్ 1986లో పోలియో నిర్మూలన కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు.అప్పటినుంచిప్రపంచంలో పోలియో నిరోధానికి ప్రయత్నిస్తోందన్నారు. రోటరీ ఈ బృహత్తర కార్యక్రమాన్ని తొలుత చేపట్టినప్పుడు 124 దేశాల్లో పోలియో కేసులు ఉన్నాయని, ప్రపంచ వ్యాప్తంగా ప్రతిరోజూ దాదాపు 1,000 మంది పిల్లలు పోలియో బారిన పడుతున్నారన్నారు. గత 39 ఏళ్లుగా అవిశ్రాంతంగా పనిచేసిన తర్వాత, యుఎస్‌డీ 7 బిలియన్లు వ్యయం చేసిన తర్వాత ప్రపంచ వ్యాప్తంగా చాలా మేరకు వ్యాధి తగ్గిందన్నారు. ఈనెల 23న జరిగే ఫెస్టివల్ నిర్వహణకు రోటరీతోపాటు విరాళాలు ఇచ్చే సంస్థలు సంయుక్తంగా పేరు పెట్టుబడి ప్రతిపాదిత స్పాన్సర్ చేయాలని కోరారు. పోలియో ముగింపులో భాగంగా యూఎస్‌డీ రూ.15,000 అందించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ యూఎస్‌సీ రూ.30,000 (గేట్స్ ఫౌండేషన్ ద్వారా 1.2 సహకారంతో సరిపోతుందని తెలిపారు. ఈమొత్తం యూఎస్‌డీ రూ.45,000, 90వేల మంది పిల్లలకు టీకాలు వేయడానికి ఖర్చు చేయనున్నట్టు చెప్పారు. శీర్షిక స్పాన్సర్‌గా రూ. 10 లక్షలు, సీఓ టైటిల్ స్పాన్సర్‌గా రూ.5 లక్షలు, స్పాన్సర్‌గా రూ.2 లక్షలు, దాతగా రూ.లక్ష ఉదారంగా ఇచ్చి ఈ కార్యక్రమాన్ని మద్దతు పలకాలని కోరారు. ఆదివారం జరిగే కల్చరల్ ఫెస్టివల్‌లో ప్రత్యక్ష ప్రదర్శనలో పలువురు ప్రముఖ సినీ కళాకారులు, నటీనటులు, సంగీత దర్శకులు, గాయకులు (ఇండియన్ ఐడల్ ఫస్ట్ ప్లేస్ రేవంత్, ప్రముఖ సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల) పాల్గొననున్నట్టు తెలిపారు. ఈ ఈవెంట్‌ను స్పాన్సర్‌లుపెద్దమొత్తంలో స్పాన్సర్ చేసి తమ సంస్థతో కలిసి రావాలని కోరారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు

జగదాంబ కూడలి, జూన్ 22: వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి శనివారం తులసీదళార్చన పూ జలు, హోమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 9 గంటలకు అమ్మవారికి తులసీ దళాలతో ప్ర త్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చక్ర నవార్చన లక్ష్మీహోమాన్ని అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య జరిపారు. ఈ సందర్భంగా 10 మంది ఉభయదాతలతో పూజలు చేయించారు.

అమర్ అక్రమ నిర్మాణం

... 5వ పేజీ తరువాయి

నిబంధనలు ఉల్లఘించారని, అదనపు అంతస్థులు నిర్మించారంటూ గాజువాక జోన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీచేశారు. దీనిపై మంత్రి హోదాలో ఉన్న అమర్‌నాథ్ నేరుగా జీవీఎంసీ కీలక అధికారికి ఫోన్ చేశారు. దీంతో కీలక అధికారి గాజువాక టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫోన్ చేసి అటువైపు కన్నెత్తి చూడద్దొంటూ హుకుం జారీచేయడంతో వారంతా మిన్నకుండిపోవాల్సి వచ్చింది. తాజాగా వైసీపీ అధికారం కోల్పోవడం, అమర్‌నాథ్ కూడా గాజువాక నుంచి పోటీ చేసి ఓడిపోవడంతో అక్రమ భవన నిర్మాణం అంశం బయటపడింది. ఇదిలావుండగా, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నిరకాల నిబంధనలను పాటిస్తూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తుండగా, జాతీయ రహదారి విస్తరణకు రూపొందించిన మాస్టర్‌ప్లాన్ ప్రకారం రెండడుగులు ముందుకువచ్చి భవనం నిర్మించారంటూ జీవీఎంసీ అధికారులు వైసీపీ ప్రభుత్వ హయాంలో యంత్రాలతో నిర్మాణాన్ని నేలమట్టం చేశారు. దానికి కూతవేటు దూరంలోనే మాజీ మంత్రి అమర్‌నాథ్ నిర్మించిన అక్రమ భవనం ఉండడంతో జీవీఎంసీ అధికారులు ఇప్పుడు దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

జీవీఎంసీలోనే ప్లాన్ పెండింగ్: గుడివాడ అమర్‌నాథ్

చట్టివానిపాలెంలో మా తాతల ఆస్తిగా వచ్చిన 400 గజాల స్థలంలో భవన నిర్మాణానికి మూడేళ్ల కిందటే జీవీఎంసీకి ప్లాన్ కోసం దరఖాస్తు చేశాం. అన్ని ఫీజులు చెల్లించడంతోపాటు రోడ్డు విస్తరణకు స్థలం కూడా జీవీఎంసీ పేరిట రిజిస్ట్రేషన్ చేశాను. మాస్టర్ ప్లాన్ ప్రకారం ఆర్‌డీపీ జరగలేదనే కారణంతో ప్లాన్‌ను జీవీఎంసీలో ఇంకా పెండింగ్‌లో ఉంచారు. నా వైపు నుంచి ప్రభుత్వానికి కట్టాల్సిన అన్నిరకాల పన్నులు చెల్లించేశాను.

రైల్వే రద్దుల పద్దు

... 5వ పేజీ తరువాయి

పది రెట్లు ఎక్కువ ప్రయాణికులు వెళ్లే రైళ్లను రద్దు చేసి, అధిక ఆదాయం వచ్చే వందే భారత్ రైళ్లను ప్రమోట్ చేయడానికి, ఆదాయం పెంచుకోవడానికే ఇలా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు తాజాగా జూన్ 24వ తేదీ నుంచి ఆగస్టు పదో తేదీ వరకు విశాఖపట్నం నుంచి రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, సికింద్రాబాద్‌ల మధ్య రోజూ నడిచే ఎనిమిది జతల రైళ్లను రద్దు చేస్తున్నట్టు వాల్తేరు డివిజన్ అధికారులు శనివారం ప్రకటించారు. ఈ జాబితాలో మచిలీపట్నం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (17219), గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (07243), విశాఖ-లింగంపల్లి జన్మభూమి, తిరుపతి-విశాఖ డబుల్ డెక్కర్, విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240), విశాఖ-విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12717), విజయవాడ-విశాఖ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22702), తదితరాలు ఉన్నాయి. అందులో గోదావరి ఎక్స్‌ప్రెస్, గరీబ్‌రథ్ రైళ్లు లేకపోవడం గమనార్హం. ఈ రెండు రైళ్ల ద్వారా వందే భారత్‌తో సమానంగా ఆదాయం వస్తుంది. అందుకని వాటిని రద్దు చేయలేదు. గోదావరి ఎక్స్‌ప్రెస్ రద్దు చేస్తే రాజకీయంగా ఒత్తిడి పెరిగిపోతుంది. అందుకని దాని జోలికి పోకుండా మిగిలిన రైళ్లను రద్దు చేసేశారు. గత ఏడాది కాలంగా ఇలాగే చేస్తున్నారు.

ఇటు భువనేశ్వర్ వైపు చూసుకుంటే ప్రయాణికుల రైళ్లను రద్దు చేసి వాటి స్థానంలో సరకులను రవాణా చేసే గూడ్స్ రైళ్లను నడుపుతున్నారు. రైల్వే ట్రాకుల నిర్మాణం, తనిఖీలు వంటివి జరిగితే గూడ్స్ రైళ్లను ఎలా అనుమతిస్తున్నారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. దీనికి అధికారులు సమాధానం చెప్పలేకపోతున్నారు. నీళ్లు నములుతున్నారు. ఆదాయం కోసం క్రమంగా వందేభారత్‌ల సంఖ్యను పెంచేసి, సాధారణ ప్రయాణికులు ఉపయోగించుకునే పాసింజర్ రైళ్లను తప్పించాలని కుట్ర జరుగుతోంది. ఈ ప్రాంత నాయకులు, ప్రజలు ఉద్యమిస్తే తప్ప ఈ కుట్రలు ఆగవు. రైళ్ల రద్దుకు ఫుల్‌స్టాప్ పడదు. ఎవరు దీనికి నడుం బిగిస్తారో చూడాలి.

కలెక్టర్ బదిలీ

... 5వ పేజీ తరువాయి

దసపల్లా భూముల విషయంలో కలెక్టర్‌పై ఆరోపణలు ఉన్నాయి. దసపల్లా భూములను 2014లో అప్పటి కలెక్టర్ యువరాజ్ '22 ఎ' పెట్టారు. అయితే హైకోర్టు ఆదేశాలలో 2016లో 22 (ఎ) నుంచి తొలగించారు. ఈ భూములను గత ప్రభుత్వ హయాంలో కేబినెట్ తీసుకున్ననిర్ణయం మేరకు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. దీనిపై ఆనేక విమర్శలు వచ్చాయి. ఇక, నగర పరిధిలోని ఎండాడలో వైసీపీ కార్యాలయం కోసం అడ్డగోలుగానిర్మించిన భారీ భవనానికి అనుమతులు ఇచ్చే విష యంలో వీఎంఆర్‌డీఏ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారనే వార్తలు వచ్చాయి. ఈ విషయంలో కలెక్టర్‌పై ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తంచేసిందనే ప్రచారం సాగుతుంది.

నేడు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు బాధ్యతలు

బదిలీపై వెళుతున్న కలెక్టర్ మల్లికార్జున ఆదివారం ఉదయం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు బాధ్యతలు అప్పగించనున్నారు. ఈ మేరకు జిల్లా రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేశారు.



అక్రమాలు చేయడం వైసీపీకి వెన్నతో పెట్టిన విద్య : ప్రణవ్

వెంకోజీపాలెం,జూన్ 22 : అక్రమాలు చేయడం వైసీపీకి వెన్నతో పెట్టిన విద్య అని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ ప్రణవ్‌గోపాల్ అన్నారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అనుమతి లేకుండా పార్టీ కార్యాలయాలు నిర్మించడం, అడ్డగోలుగా ప్రజాధనం దుర్వినియోగం చేయడం వైసీపీ నేతలకు, జగన్‌కు అలవాటేనని చెప్పారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వంటి వాళ్లు వైసీపీ తప్పులను ఒప్పులుగా ప్రజలకు చూపించాలనుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

పంట రుణాలు రెన్యువల్ చేసిన వారికే రాయితీలు

పద్మనాభం (రూరల్), జూన్ 22 : బాందేవపురం పీఏసీఎస్‌లో అప్పులు తీసుకున్న రైతులు డిజిటల్ లావాదేవీలను కొనసాగించాలని ఆ సంఘం సీఈఓ ఆంజనేయులు కోరారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంఘాల్లో ఆన్‌లైన్ లావాదేవీలు జరుగుతున్నాయని, స్థానిక సంఘం నుంచి సుమారు 1200 మంది రైతులు వివిధ రకాల పంట రుణాలు తీసుకున్నారని, వారంతా 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పంట రుణాలను త్వరగా రెన్యువల్ చేసుకోవాలన్నారు. సకాలంలో రుణాలు రెన్యువల్ చేసుకున్న వారికి ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని చెప్పారు. ఈ విషయాన్ని రైతులు గుర్తించి ఈనెలాఖరు నాటికి పంట రుణాలను రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. రెన్యువల్‌కు వచ్చే వారు 1బీ అడంగల్, 4 పాస్ ఫొటోలు, ఆధార్, రేషన్ కార్డు, పాసు పుస్తకం జిరాక్స్‌లు తీసుకురావాలని తెలిపారు.

2న బంగారమ్మ తల్లి పండగ

సింహాచలం, జూన్ 22 : అడివివరం తదితర ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత, సింహాద్రినాథుని సోదరి బంగారమ్మ తల్లి వార్షిక పండగ జూలై 2న నిర్వహించనున్నట్టు అడివివరం మాజీ సర్పంచ్ లండ వెంకటరమణ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం దండోరాతో ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. 24న బంగారమ్మ దేవర తెచ్చుట, జూలై 1న తొలేళ్ళు, 2న అనుపోత్సవం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కాగా 30న సాయంత్రం నుంచి 2 వరకు గ్రామం అంతా విద్యుత్ దీపాలంకరణ చేయాలని దేవస్థానం అధికారులను ఉత్సవ కమిటీ కోరింది.

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ I లో..

అతిసారంపై అప్రమత్తం : జీవీఎంసీ కమిషనర్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

వెంకోజీపాలెం, జూన్ 22 : నగరంలో అతిసార ప్రబలకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ఆదేశించారు. శనివారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో అదనపు కమిషనర్ కెఎస్ విశ్వనాథన్, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'స్టాప్ డయేరియా' ప్రచార కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలో అతిసార, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని అతిసారతో పాటు మలేరియా, డెంగ్యూ, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిసిల్టింగ్ ఆఫ్ డ్రైన్స్ కార్యక్రమం ముమ్మరంగా చేపట్టాలని, నగరంలో 10.19 కిలోమీటర్ల మేర ఉన్న ప్రధాన గెడ్డల్లోని పూడికలు తొలగించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.అలాగే 28.90 కిలోమీటర్ల మేర ఉన్న చిన్న కాలువల్లోని పూడికలను కూడా యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని ప్రజా ఆరోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. దోమలు వృద్ధి చెందకుండా యాంటీ లార్వా ఆపరేషన్ విస్తృతంగా నిర్వహించాలన్నారు. ప్రతి వారం తప్పనిసరిగా కాలువల్లో స్ప్రేయింగ్, వీధులు, కాలనీల్లో ఫాగింగ్, చెరువుల్లో గంబూషియా చేపల విడుదల కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. వారంలో ఒక రోజు డ్రై డే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.

విశాలాక్షినగర్‌లో దుకాణాలు తొలగింపు

విశాలాక్షినగర్, జూన్ 22 : జీవీఎంసీ 9వ వార్డు బీచ్ రోడ్డు నుంచి విశాలాక్షినగర్‌కు వెళ్లే మలుపులో ఇటీవల తొలగించిన దుకాణాల స్థానంలో తిరిగి రాత్రికి రాత్రి దుకాణాలు ఏర్పాటు చేయడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించారు. ఈమేరకు శనివారం అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలను క్రేన్ సహాయంతో తొలగించారు. టౌన్ ప్లానింగ్ స్క్వాడ్ అధికారి పెంటకోట రమేష్ ఆధ్వర్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

పుస్తకాలు పంపిణీ

ఎంవీపీ కాలనీ, జూన్ 22 : ఎంవీపీ కాలనీలోని హిడెన్ స్ప్రౌట్స్ పాఠశాలలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు తనయుడు ప్రతాప్ విద్యార్థులకు శనివారం పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు చోడె పట్టాభిరాం, పోతనరెడ్డి, కాళ్ల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెలగపూడి జన్మదిన వేడుకలు


16వ వార్డులో రక్తదానం చేస్తున్న కార్యకర్తలు


28వ వార్డులో జరిగిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న వెలగపూడి ప్రతాప్ రుద్ర

ఎంవీపీ కాలనీ, జూన్ 22 : తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు జన్మదిన వేడుకలు ఆయన క్యాంపు కార్యాలయం వద్ద శనివారం ఘనంగా జరిగాయి. నాలుగోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన తర్వాత వెలగపూడి మొదటి జన్మదినం కావడంతో నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లోనూ వేడుకలు జరిపారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం, సీనియర్ నాయకులు కాళ్ల శంకర్ ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయం వద్ద వెలగపూడి తనయుడు ప్రతాప్ రుద్ర కేక్‌కట్ చేశారు.

మహారాణిపేట : వెలగపూడి జన్మదిన వేడుకలను 28వ వార్డులో టీడీపీ సీనియర్ నాయకుడు నక్కా కనకరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పితానిదిబ్బ ప్రాంతంలో జరిగిన ఈ వేడుకల్లో వెలగపూడి కుమారుడు ప్రతాప్ రుద్ర ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఉరుకూటి పైడిరాజు, జోగి సన్యాసిరావు, నాగుల సన్యాసిరావు, నడిగట్ల శంకరరావు, సుంకర శ్యామల, ఉసిరికాయల డిల్లీశ్వరి, నాగుల ఆశ్లేష, బొట్టా అప్పలరాజు, పల్లా అజయ్, వేణు, లక్ష్మి పాల్గొన్నారు.

విశాలాక్షినగర్ : జీవీఎంసీ 9వ వార్డులోని రామాలయం వీధిలో కూటమి నాయకులు వెలగపూడి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు, వెజేళ్ల సుబ్బరాజు, వెంపాడ శ్రీనివాసరెడ్డి, గొలగాని వెంకన్న, శివకేశవరెడ్డి, అన్నె రాజా, నాగభూషణం, సుధా,బీజేపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమ్మడి సుజాత పాల్గొన్నారు.

మద్దిలపాలెం : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలో ఎమ్మెల్యే వెలగపూడి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వార్డు మాజీ కార్పొరేటర్ బొట్టా నీలిమ, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెలగపూడి తనయుడు ప్రతాప్ రుద్ర, నాయకలు దువ్వి స్వామి, ఒమ్మి అప్పారావు, డొక్కర శ్రీను, కోడిబోయిన ఆనంద్, గణేష్, డేవిడ్, మిల్లు రాజు పాల్గొన్నారు.

16వ వార్డులో రక్తదాన శిబిరం

వెంకోజీపాలెం : వెలగపూడి జన్మదినోత్సవం సందర్భంగా 16వ వార్డు టీడీపీ అధ్యక్షుడు నారు గోపి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 90 మంది రక్తదానం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. అలాగే మధ్యాహ్నం మహా అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు వెలగపూడి ప్రతాప్ రుద్ర, టీడీపీ నాయకులు బోర ధనరెడ్డి, సతీష్, ముగడ వాసు, పల్లా ఉమారాణి, మొల్లి శోభ, మొల్లి శంకర్, జి. అప్పన్న, బి. బంగారురాజు, ఆర్. భరత్‌కుమార్, ఎం. సత్య ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ సభ్యులు పాల్గొన్నారు. 15వ వార్డు హెచ్‌బీ కాలనీ ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే వెలగపూడి జన్మదిన కేక్‌ను వార్డు టీడీపీ అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, మళ్ల రవికుమార్ ఆధ్వర్యంలో కట్ చేసి, స్వీట్లు పంచారు.

ఆరిలోవ : టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు ఆధ్వర్యంలో వెలగపూడి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు ఆరిలోవలో వృద్ధులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. పదో వార్డులో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి రాజశేఖర్ ఆధ్వర్యంలో, 11, 9, 12 వార్డుల్లోనూ జరిగాయి.

పెదవాల్తేరు : చినవాల్తేరులో పీతల అమరేంద్ర ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భైరెడ్డి పోతన్నరెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు ప్రణవ్‌గోపాల్, బీజేపీ నేత మురళి మోహన్‌రాజు, శ్రీరామ్, ఆనంద్, అనిల్, జనసేన వార్డు అధ్యక్షుడు రాదేశ్యామ్ పాల్గొన్నారు.

'మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం'



వీడియో ద్వారా అవగాహన కల్పిస్తున్న ద్వారకా ఏసీపీ రాంబాబు

ఆరిలోవ, జూన్ 22 : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ద్వారకా ఏసీపీ రాంబాబు సూచించారు. శనివారం సాయంత్రం తోటగరువులోని ఎర్ని దుర్గమాం కల్యాణ మండపంలో 9, 10, 11,12,13 వార్డులకు చెందిన యువతకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి, హెరాయిన్, కొకైన్ వంటివి వినియోగించడం చట్ట ప్రకారం నేరమన్నారు. వాటికి యువత దూరంగా ఉండాలని చెప్పారు. సెల్ ఫోన్లలో తెలియని యాప్‌లను డౌన్ లోడ్ చేయరాదని తెలిపారు. అనంతరం మత్తు పదార్థాలు సేవించడం వల్ల జరిగే అనర్థాల గురించి వీడియో ప్రదర్శించి, వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, ఆరిలోవ సీఐ గోవిందరావు, పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి రాజశేఖర్, పోలారావు. తాతారావు, బుడుమూరు గోవింద్ పాల్గొన్నారు.

తగరపువలస : విద్యార్థులు డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని నార్త్ ఏసీపీ సునీల్ సూచించారు. శనివారం సంగివలస ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చాలామంది అవగాహన లేక మత్తుకు బానిస అవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో సీఐ రమేష్, ఎస్ఐ హరీష్, తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండి వితరణ

భీమునిపట్నం (రూరల్), జూన్ 22 : మండలంలోని పలు గ్రామాల్లో గంధవరం వాసవీ క్లబ్ సభ్యులు శనివారం డాన్ టు డెస్క్ పేరు ఏడు సేవా కార్యక్రమాలు చేపట్టారు. వీధుల్లో కూరగాయలు అమ్ముకుంటున్న ఐదుగురికి గొడుగులు. వివిధ పాఠశాలల్లో చదువుతున్న 40 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందించారు. అలాగే ట్రాఫిక్ పోలీసులకు పది మాస్కులు, తువ్వాళ్లు, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయానికి బియ్యం, నిరుపేదకు తోపుడు బండిని అందించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు తాటికొండ వెంకటరావు, సభ్యులు మన్మథరావు, పాపారావు, లక్ష్మణరావు, గుప్తా సన్యాసిరావు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పద్మనాభం, జూన్ 22 : మండలంలోని అనంతవరంలో హిందూ జ్ఞానవేదిక ప్రబోత సేవా సమితి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు ప్రజలకు త్రైత సిద్ధాంతం సాహిత్యాన్ని పరిచయం చేశారు. ఈకార్యక్రమంలో విజయరాంపురం ఇందూ జ్ఞానవేదిక కమిటీ అధ్యక్షుడు కె. త్రినాథరావు, కృష్ణసూరప్పడు, పైడన్న, పోలీసునాయుడు, భవానీ, లక్ష్మి, ఆదమ్మ పాల్గొన్నారు.

పేకాట శిబిరాలు తనిఖీ

ఆనందపురం, జూన్ 22 :మండలంలో విచ్చలవిడిగా నిర్వహిస్తున్న పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేస్తున్నారు.వారం రోజులుగా సుభాష్ చంద్రబోసు లేఅవుట్ వద్ద, దిబ్బడిపాలెం, గంభీరం చందన హోటల్ వద్ద తనిఖీ చేస్తున్నారు. ఆనందపురం ఎస్‌హెచ్‌వో తిరుపతిరావు, ఎస్ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో మూడు బృందాలుగా ఏర్పడి ఈ తనిఖీలు చేపడుతున్నారు.

అప్పన్నకు జేష్ఠ పూర్ణిమ అభిషేకాలు

సింహాచలం, జూన్ 22 : వరాహలక్ష్మీనృసింహస్వామికి జేష్ఠ పూర్ణిమ సందర్భంగా శనివారం విశేష అభిషేకాలు నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి పూజలు జరిపారు. అనంతరం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులు, ఆళ్వార్లు, లక్ష్మీనారాయణులతో కలిపి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ముఖ్య అర్చకుడు గొడవర్తి సింహగిరి, తదితరులు విశ్వక్సేనారాధన చేసి షోడశోపచారాలు సమర్పించారు. విగ్రహాలకు తైలం పూసి పసుపు ముద్దను భుజకీర్తులు, హృదయంపై, శిరస్సు భాగాన ఉంచి అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

నృసింహ వనంలో ఏరువాక పూజలు


నృసింహవనంలో దుక్కి దున్నుతున్న ఈఓ శ్రీనివాసమూర్తి

సింహాచలం, జూన్ 22 : ఏరువాక పౌర్ణమి పురస్కరించుకుని సింహాచలం దేవస్థానం వ్యవసాయ క్షేత్రంలో ప్రత్యేక పూజల అనంతరం ఈఓ శ్రీనివాసమూర్తి హలం పట్టి పొలం దున్నారు. రైతులు వేసవి తరువాత వచ్చే తొలకరి వర్షాల ఆధారంగా జేష్ఠమాస శుక్లపక్ష పౌర్ణమి నాడు పొలంలో పనులు చేసే నాగళ్లకు,ఎద్దులకు, భూ మాతకు ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. అదే ఒరవడిని కొనసాగిస్తూ నృసింహ వనంలోని వ్యవసాయ క్షేత్రంలో ఎనిమిదేళ్లుగా ఏరువాక పూర్ణిమ జరుపుతున్నారు.శనివారం ఉదయం వనంలో నాగళికి, ఎద్దులకు, భూమాతకు ఈఓతో పండితులు విశేష పూజలు జరిపించారు. తరువాత ఈఓ నాగలి పట్టుకుని పొలాన్ని దున్ని విత్తనాలు చల్లారు.